మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 20 బుధవారం 18 - 06 - 2025 పేజీలు: 8 వెల: 4

## యోగ మన వారసత్వ సంపద



3లో..

# కుప్పం ఘటనపై సీఎం చంద్రబాబు

# సీరియస్





- అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టేసిన ఘటనపై సీరియస్
- నారాయణపురం గ్రామంలో మహిళపై దాడి ఘటన తీవ్ర కలకలం
- ఇటువంటి చర్యలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా పోలీసులు చూడాలి : సీఎం
- సాటి మహిళగా ఖండిస్తునా : వైఎస్ షర్మిల

మన గళం, అమరావతి : అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టేసిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. కుప్పంలో మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలకు సీఎం ఆదేశించారు. అప్పు తీర్చలేదని కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో మహిళపై దాడి ఘటన తీవ్ర కలకలం రేపింది. మహిళను మునికన్నప్ప, అతని కుటుంబ సభ్యులు చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించారు. నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేశామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి జిల్లా ఎస్పీ తెలియజేశారు. మహిళను చెట్టుకు కట్టేసి హింసించిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి చర్యలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా పోలీసులు చూడాలన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలని, వారి వివరాలను జిల్లా అధికారులకు అందజేయాలని సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే బాధితులకు ఎందుకు అప్పులు అయ్యాయి అనే విషయాన్ని సేకరించి సీఎం పేషీకి పంపించాలని ఆదేశాలిచ్చారు. ఈ విషయంపై చిత్తూరు జిల్లా కలెక్టర్‌తోనూ సీఎం మాట్లాడి.. ఘటన వివరాలు పంపాలని ఆదేశాలు జారీ చేశారు.

కాగా.. కుప్పం మండలం నారాయణపురానికి చెందిన 2 లో..



### వరుస ఘటనలతో

## భయాందోళన

మన గళం, న్యూఢిల్లీ : ఎయిరిండియా విమానాల్లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా, అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరాల్సిన మరో విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆ విమాన సర్వీసును రద్దు చేశారు. గత వారం ఇదే మార్గంలో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటన మరువకముందే, మళ్ళీ అదే మార్గంలో వెళ్లే విమానానికి సాంకేతిక సమస్య తలెత్తడం 2లో..

### ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సన్నిహితుడిని

## చంపేశాం



టెహ్రాన్‌లోని కమాండ్ సెంటర్‌పై నిన్న రాత్రి ఇజ్రాయెల్ మెరుపు దాడి

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: టెహ్రాన్‌లో తమ సైన్యం మెరుపుదాడి చేసి ఇరాన్‌కు చెందిన అత్యున్నత సైనిక కమాండర్ అలీ షాద్మానీని హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం తాజాగా ప్రకటించింది. షాద్మానీ, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి 2లో..

## షర్మిల ఫోన్ ట్యాప్!

- కోడ్ భాష వాడి సంభాషణలు రికార్డ్ చేశారని ఆరోపణ
- తెలంగాణలో ఫోన్ ట్యాంపింగ్ అంశంలో మరో మలుపు
- వైసీపీ హయాంలో షర్మిల ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తింపు



మన గళం, అమరావతి : తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్‌కు గురైనట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేరు కూడా 2 లో..

### ఆరోగ్య శాఖపై రూ.6,500 కోట్ల

## అప్పులు మిగిల్చారు

- గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆరోగ్య వ్యవస్థ భ్రష్టుపట్టిందన్న సత్యకుమార్
- ఆరోగ్యశ్రీకి రూ.2,500 కోట్లు, మందులకు రూ.1000 కోట్ల బకాయిలున్నాయని వెల్లడి
- ఏడాదిలో మౌలిక వసతులు, సిబ్బంది నియామకంతో మార్పు తెచ్చామన్న మంత్రి



మన గళం, అమరావతి : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని ఇతర వ్యవస్థలతో పాటు ఆరోగ్య వ్యవస్థను కూడా పూర్తిగా నిర్వీర్యం చేసి భ్రష్టు పట్టించారని ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించారని, అందుకే ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను వారసత్వంగా ఇవ్వడమే కాకుండా, ఆరోగ్య రంగంపై కూడా సుమారు రూ.6,500 కోట్ల మేర అప్పుల భారాన్ని మోపిందని ఆరోపించారు. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల 2లో..



## జాక్‌పాట్ కొట్టిన భారత్

మన గళం, న్యూఢిల్లీ : అండమాన్ అండ్ నికోబార్ సముద్రంలో గయానా తరహా చమురు నిక్షేపాలను ఉన్నాయని భారత్ కనుగొంది. సుమారు 184,440 కోట్ల లీటర్ల ముడి చమురు నిల్వలు ఉండవచ్చని భారత పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడించారు. దీని కోసం ప్రభుత్వ రంగ సంస్థలైన ఆయిల్ ఇండియా, ఓఎన్జీసీ అక్కడ చమురు, సహజవాయువు కోసం ఆ సముద్రంలో 2 లో..



### ఇండియాకు ఐదు


## దేశాల మద్దతు

టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయి

మన గళం, అంబేద్కర్ కోనసీమ : ఆపరేషన్ సిందూర్‌ని ప్రారంభించి టెర్రరిజం అణచివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నేతృత్వంలో గయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, యునైటెడ్ దేశాలను సందర్శించారు. ఈ బృందంలో ఎంపీ హరీష్ బాలయోగి కూడా ఉన్నారు. ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. ఐదు దేశాలతో దౌత్యపరమైన చర్చలు జరిపినట్లు వెల్లడించారు. టెర్రరిజానికి 2 లో..

### పవన్ ను టార్గెట్ చేసిన

## యాంకర్ శ్యామల



- ముక్తేశ్వరం ఆలయంలో పట్టపగలు దోపిడీ
- సనాతని పవన్ పట్టించుకోరా అంటూ వ్యాఖ్యలు

మన గళం, అంబేద్కర్ కోనసీమ : జిల్లాలోని ఓ ప్రసిద్ధ ఆలయంలో పట్టపగలే దొంగలు చొరబడి లక్షల విలువైన ఆభరణాలను అపహరించుకుపోయిన ఘటన ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. ఈ ఉదంతంపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల... ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని గుడిలో పట్టపగలు బంగారం దోపిడీ జరిగినా పట్టించుకోలేనంత బిజీగా ఉన్నారా 'ది సో కాల్డ్ సనాతని' పవన్ కల్యాణ్ గారూ?" అంటూ వ్యంగ్యంగా 2 లో..



### తండ్రిపై కుమార్తె

## రోకలి బండతో దాడి

మన గళం, హైదరాబాద్ : రక్త సంబంధాలు రోజు రోజుకు కనుమరుగైపోతున్నాయి. ఆస్తులు, ఇంట్లో గొడవలు ఇలా రకరకాల కారణాలతో ఆయా కుటుంబసభ్యులు రక్తసంబంధాలనే మరిచిపోతున్నారు. దాడులు చేసుకుంటూ హత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా కన్నతండ్రిని కుమార్తె రోకలి బండతో కొట్టి చంపిన విషాదకర సంఘటన నిజామాబాద్ జిల్లా, నవీపేట్ మండలం, ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. వ్యసనాలకు బానిసైన తండ్రి పుల్లెపు నర్సయ్య (54)తో కుమార్తె వర్షిత గొడవ పడింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ పెరిగి పెద్దదయింది. దీంతో ఆవేశంలో కుమార్తె కన్న తండ్రిపై రోకలి బండతో దాడి చేసి కొట్టింది. ఈ 2 లో..

### గుజరాత్ గిఫ్ట్ సిటీలో సైప్రస్

## స్టాక్ ఎక్ఛేంజ్ ఏర్పాటు



మన గళం డెస్క్ : గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో సైప్రస్ స్టాక్‌ఎక్స్ఛేంజ్ ఏర్పాటు అవుతోంది. ఈ మేరకు మన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు, టర్కీ ఎక్స్ఛేంజ్‌కు మధ్య ఒప్పందం కుదిరింది. సైప్రస్‌లో పర్యటించిన ప్రధాని మోదీ, ఈ ఒప్పందంపై హర్షం వ్యక్తం చేశారు. సైప్రస్‌లో జరిగిన బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ అంశం గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గిఫ్ట్ 2 లో..

# వరుస ఘటనలతో భయాందోళన

**మొదటి పేజీ తరువాయి** గమనార్హం. ఈ మధ్యాహ్నం 1.10 గంటలకు అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరాల్సిన ఎయిరిండియాకు చెందిన ఏఐ-159 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానంలో సాంకేతిక సమస్య ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విమానం గాల్లోకి ఎగరడానికి ముందు నిర్వహించిన సాధారణ తనిఖీల్లో ఈ లోపం వెలుగుచూసింది. దీంతో ప్రయాణికుల భద్రత దృష్ట్యా విమాన సర్వీసును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ఈ నెల జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే కుప్పకూలి దగ్ధమైన విషయం తెలిసిందే. ఆ ఘోర దుర్ఘటనలో ఒక్కరు మినహా విమానంలో ప్రయాణిస్తున్న వారంతా మృతి చెందారు. ఈ విమానం డాక్టర్స్ హాస్టల్‌పై కూలడంతో మరికొంతమంది ఇతరులు మృతి చెందారు. ఈ విషాద ఘటన అనంతరం, ఎయిరిండియా ఏఐ-171 ఫ్లైట్ నంబర్‌ను నిలిపివేసి, దాని స్థానంలో ఏఐ-159 నంబరుతో సర్వీసులను నడపాలని నిర్ణయించింది. కాగా, ఆ ప్రమాదం తర్వాత లండన్‌కు షెడ్యూల్ చేయబడిన తొలి విమానం ఇదే కావడం, ఇప్పుడు అదే సిరీస్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడం ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

# ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సన్నిహితుడిని చంపేశాం

**మొదటి పేజీ తరువాయి** అత్యంత సన్నిహితుడని పేర్కొంది. ఈ ఘటనపై ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. "సోమవారం రాత్రి అకస్మాత్తుగా లభించిన అవకాశంతో ఇజ్రాయెల్ వైమానిక దళం టెహ్రాన్ నగరంలోని ఒక కమాండ్ సెంటర్‌పై దాడి చేసింది. ఈ దాడిలో అత్యంత సీనియర్ మిలిటరీ కమాండర్, ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీకి అత్యంత సన్నిహితుడైన అలీ షాద్మానీ హతమయ్యారు" అని తెలిపింది. అలీ షాద్మానీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) మరియు ఇరాన్ సాయుధ దళాలు రెండింటికీ కమాండర్‌గా వ్యవహరించారని కూడా ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఈ దాడి ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉందని అంతర్జాతీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రకటనపై ఇరాన్ నుంచి అధికారికంగా స్పందన రావాల్సి ఉంది.

# జాక్‌పాట్ కొట్టిన భారత్



**మొదటి పేజీ తరువాయి** తవ్వకాలు జరుపుతున్నాయి. గయానాలో కనుగోన్నంత పెద్ద మొత్తంలోనే.. అండమాన్ ప్రాంతంలో కూడా చమురు నిక్షేపాలు ఉన్నాయని.. అవి భారతదేశ ఆర్థిక వ్యవస్థను 3.7 ట్రిలియన్ల డాలర్ల నుంచి 20 ట్రిలియన్ల డాలర్ల వరకు విస్తరించడంలో సహాయపడుతాయని హర్దీప్ సింగ్ తెలిపారు. కానీ అక్కడ చమురు నిల్వలను వెలికి తీయడం.. భారీ ఖర్చుతో కూడుకున్న పని అని ఆయన అన్నారు. ఒక్కో బావి తవ్వడానికి దాదాపు రూ.850 కోట్లు ఖర్చవుతుందని.. గయానాలో కూడా కొత్త చమురు నిక్షేపాల కోసం 44 బావులు తవ్వాల్సి వచ్చిందని.. దానికోసం అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించారన్నారు హర్దీప్ సింగ్. అక్కడ ఒక్కో బావికి 10 కోట్ల డాలర్ల వరకు ఖర్చు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఓఎన్‌జీసీ చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం రూ.37,000 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో ఎక్కువ భాగం అండమాన్, నికోబార్ సముద్ర జలాల్లో బావుల తవ్వకానికి ఉపయోగించారు. అండమాన్ సముద్రంలో దాదాపు రెండు లక్షల కోట్ల లీటర్ల చమురు నిక్షేపాలు ఉన్నాయని అంచనా వేస్తోంది కేంద్రం. ఇది సుమారు 1,160 కోట్ల బ్యారెళ్లకు సమానం. గయానాలో కూడా ఇంతే మొత్తంలో చమురు నిక్షేపాలను వెలికి తీశారు. అక్కడ హెస్ కార్పొరేషన్, చైనాకు చెందిన సీఎన్ఓఓసీ కంపెనీలు ఈ నిక్షేపాలను కనుగొన్నాయి. దీంతో గయానా ప్రపంచంలోనే 17వ అతిపెద్ద చమురు నిక్షేపాలు కలిగిన దేశంగా అవతరించింది.

# గుజరాత్ గిఫ్ట్ సిటీలో సైప్రస్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు



**మొదటి పేజీ తరువాయి** సిటీ ఒక అంతర్జాతీయ ఆర్థిక కేంద్రంగా ఎదుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. రెండు దేశాల ఆర్థిక సంబంధాలు బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. భారత్-సైప్రస్ మధ్య ఆర్థిక రంగంతోపాటు, పలు రంగాల్లో పరస్పర సహకారం పెంపొందాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. భారత్-సైప్రస్-గ్రీస్ కలిసి వ్యాపార, పెట్టుబడుల కౌన్సిల్ ఏర్పాటు చేయడాన్ని ఆయన స్వాగతిస్తుంచారు. గిఫ్ట్ సిటీలో సైప్రస్ స్టాక్‌ఎక్స్ఛేంజ్ ఏర్పాటు కోసం ఒప్పందం చేసుకోవడానికి సహకరించిన ప్రధాని మోదీకి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ %జజుూ% ఆశిష్ చౌహాన్ ధన్యవాదాలు తెలిపారు.

# షర్మిల ఫోన్ ట్యాప్!



**మొదటి పేజీ తరువాయి** చేరినట్లు తెలుస్తోంది. ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో షర్మిల మొబైల్ ఫోన్లను అత్యంత రహస్యంగా ట్యాప్ చేసినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా కోడ్ భాషను కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. షర్మిల వాయిస్ సంభాషణలను రికార్డు చేయడమే కాకుండా, ఆమె ఎవరెవరితో మాట్లాడుతున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు ఆమె సోదరుడి (జగన్)కి చేరవేసినట్లు ఆరోపణలున్నాయి. షర్మిల ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నారనే దానిపై నిశితంగా నిఘా పెట్టినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అంతేకాకుండా, షర్మిలకు సన్నిహితంగా ఉండే కొందరిని ఓ సీనియర్ పోలీస్ అధికారి పిలిపించి హెచ్చరించినట్లు కూడా గుర్తించారు. తన ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్న విషయాన్ని షర్మిల అప్పట్లోనే పసిగట్టినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆమె వద్ద కీలక ఆధారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

# ఇండియాకు ఐదు దేశాల మద్దతు

**మొదటి పేజీ తరువాయి** వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆ దేశాల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు ఎంపీ గంటి హరీష్ మాధుర్. మే 24వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ దేశాల్లో తాము పర్యటించామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ వెల్లడించారు. యునైటెడ్ నేషన్స్ పర్యటన అనంతరం ఇండియాకు చేరుకున్నామని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదామని ఆయా దేశాలకు తాము వివరించామని అన్నారు. పాకిస్థాన్ మిలటరీ బేస్ క్యాంప్‌నకు ఇబ్బంది లేకుండా టెర్రరిస్టులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని భారత బలగాలు దాడులు చేశాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈ పర్యటన చేశామని చెప్పారు. న్యూయార్క్ 9/11 టెర్రరిస్ట్ దాడులను జ్ఞాపకం చేసుకుని, టెర్రరిజాన్ని అంతం చేయాలనే విషయాన్ని ఆయా దేశాల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశామని అన్నారు. తాము పర్యటించిన ప్రతి దేశంలో భారతదేశానికి మద్దతు లభించిందని గుర్తుచేశారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాల ప్రతినిధులకు భారతదేశం అండగా ఉంటుందని చెప్పామని అన్నారు. యుద్ధం పరిష్కారం కాదు కానీ టెర్రరిజం అంతం చేసే ప్రణాళికలకు అందరూ సహకరిస్తున్నారని అన్నారు. భార్య బిడ్డల ముందు పహల్గామ్‌లో పర్యాటకులను చంపడం నీచమైన చర్య అని... దీనినే ప్రపంచ దేశాలకు తెలియజేశామని చెప్పారు. ఇండియాతో కలసి రావటానికి ప్రపంచ దేశాలు మొగ్గు చూపాయని అన్నారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టామన్నారు. పాకిస్థాన్ చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలకు తెలియజేశామని... వాస్తవాలను అందరూ గ్రహించారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో సామాన్యులకు, పౌరులకు ఎలాంటి హాని జరగలేదని గుర్తుచేశారు. పక్క ప్రణాళికతో ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశం తనకు కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృత్ఞతలు ఎంపీ గంటి హరీష్ మాధుర్

# పవన్ ను టార్గెట్ చేసిన యాంకర్ శ్యామల

**మొదటి పేజీ తరువాయి** ప్రశ్నించారు. ఈ మేరకు దోపిడీ వార్త క్లిప్పింగ్ ను కూడా శ్యామల సోషల్ మీడియాలో పంచుకున్నారు. వివరాల్లోకి వెళితే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం ముక్తేశ్వరంలో కొలువైన శ్రీముక్తికాంత క్షణముక్తేశ్వరాలయంలో శుక్రవారం (జూన్ 13) మధ్యాహ్నం ఈ చోరీ జరిగింది. ఆలయం మూసివేసిన సమయంలో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడిలోని అమ్మవారి మెడలోని బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. వీటి విలువ సుమారు లక్షా నలభై వేల రూపాయలు ఉంటుందని ఆలయ వర్గాలు మరియు స్థానికులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ ఇన్‌ఛార్జ్ కె. ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని బృందం ఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలతో పాటు ఇతర కీలక ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తును ముమ్మరం చేశారు. సమీపంలోని సీసీటీవీ



పుటేజ్‌లను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# కుప్పం ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

**మొదటి పేజీ తరువాయి** మునికన్నప్ప దగ్గర అదే గ్రామానికి చెందిన తిమ్మరాయప్ప మూడేళ్ల క్రితం రూ.80 వేలు అప్పు తీసుకున్నాడు. అయితే అప్పు తీర్చలేక తిమ్మరాయప్ప తన భార్య, పిల్లలను గ్రామంలోనే వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో చేసేదేమీ లేక భార్య శిరీష కూలీ పనులు చేస్తూ పిల్లలను పోషించుకుంటూ అప్పులు తీరుస్తోంది. అయితే సకాలంలో అప్పు చెల్లించలేదని మహిళ పట్ల మునికన్నప్ప, అతని కుటుంబసభ్యులు దారుణంగా వ్యవహరించారు. మహిళను చెట్టుకు కట్టేసి హింసించారు. ఈ ఘటన జిల్లాలో సంచలనంగా మారింది. విషయం తెలిసిన పోలీసులు మునికన్నప్ప, అతడి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశారు.

– సాటి మహిళగా ఖండిస్తున్నా: వైఎస్ షర్మిల

అప్పు తీర్చలేదని కుప్పంలో ఓ మహిళను చెట్టుకు కట్టేసి దాడి చేయడం అమానుషమని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. సభ్య సమాజం తల దించుకొనే దుశ్చర్య ఇది అంటూ వ్యాఖ్యలు చేశారు. కన్న కొడుకు ముందే తల్లికి జరిగిన ఘోర అవమానమన్నారు. సాటి మహిళగా ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఇలాంటి అమానవీయ ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడాలని.. ఆ మహిళకు జరిగిన అవమానానికి బాధ్యత వహించి



ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.

# ఆరోగ్య శాఖపై రూ.6,500 కోట్ల అప్పులు మిగిల్చారు

**మొదటి పేజీ తరువాయి** గురించి మంత్రి సత్యకుమార్ వివరిస్తూ, "ఆరోగ్యశ్రీ పథకం కింద చెల్లించాల్సిన బకాయిలు రూ.2,500 కోట్లు, మందుల సరఫరా సంస్థలకు ఇవ్వాల్సినవి రూ.1,000 కోట్లు ఉన్నాయి. వీటితో పాటు వైద్య కళాశాలల నిర్మాణ పనులకు సంబంధించి రూ.700 కోట్లు, నాడు-నేడు కార్యక్రమం కింద మరో రూ.400 కోట్ల అప్పులు కూడా మిగిల్చి వెళ్లారు" అని తెలిపారు. ఇన్ని అప్పులతో ఆరోగ్య వ్యవస్థను గందరగోళంలో పడేశారని ఆయన మండిపడ్డారు. అయితే, తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే వైద్య ఆరోగ్య రంగంలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. "మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, అవసరమైన మానవ వనరుల సిబ్బంది నియామకం చేపట్టడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణను బలోపేతం చేశాం. ముఖ్యంగా, జాతీయ ఆరోగ్య మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్) కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 రకాల పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయి" అని ఆయన వివరించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాల పనితీరును మెచ్చిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రోత్సాహకంగా రూ.100 కోట్లను విడుదల చేసిందని ఆయన వెల్లడించారు.

# తండ్రిపై కుమార్తె రోకలి బండతో దాడి

**మొదటి పేజీ తరువాయి** గాయపడిన నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న నవీపేట్ ఎస్ఐ వినయ్ గ్రామానికి చేరుకొని ఈ సంఘటనపై విచారణ చేపట్టారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని..దీంతో ఆవేశంలో కుమార్తె కన్న తండ్రిపై రోకలి బండతో దాడి చేసి కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలి

**– కర్నూలు ఎం.పి. బస్తిపాటి నాగరాజు**



మన గళం,కర్నూలు రూరల్ : మారుతున్న జీవన విధానంలో ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు..ఈ నెల 21 న అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ప్రజలకు యోగ పై అవగాహన కలిపించేందుకు కర్నూలు రూరల్ మండలం పంచాలింగాల గ్రామంలోని తన స్వగృహం లో ఆయన యోగాసానాలు చేసారు. యోగా చేయడం వలన మంచి ఆరోగ్యం కలుగుతుందని..యోగా శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ఒత్తిడిని తగ్గిస్తుందని ఎం.పి నాగరాజు తెలిపారు.

# పాలస్తీనా పై ఇజ్రాయేల్ యుద్ధాన్ని ఆపాలి

**– శాంతిని నెలకొల్పాలి**
**– సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్**




మన గళం,కర్నూలు పాతబస్తీ : ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా పై ఇరాన్ పై చేసే యుద్ధాన్ని ఆపాలని కోరుతూ సిఐటియు జాతీయ కమిటీ పిలుపుమేరకు సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గడియారం హాస్పిటల్ ముందు పాలిస్తేనా సంఘీభావ కార్యక్రమం సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా పై మతోన్మాద యుద్ధాన్ని చేస్తూ పాలస్తినా దేశాన్ని రక్త పాతన్ని ప్రపంచ పటంలో లేకుండా చేయాలనే దురుద్దేశంతో మహిళలు, పసిపిల్లలని చూడకుండా వారిని అతికిరతంగా చంపడం దుర్మార్గమన్నారు, ఐక్యరాజ్యసమితి, మానవత్వం ఉన్న ప్రపంచ దేశాలన్నీ యుద్ధం వద్దు చర్చలతో సమస్యను పరిష్కరించాలని కోరుతున్న అమెరికా సామ్రాజ్యవాదం వాటి ఆదాయం కోసం ఇశ్రాయేలు ప్రోత్సహిస్తున్నందున యుద్ధం కొనసాగించడం భవిష్యత్తులో ఇజ్రాయేలుకు నష్టం జరుగుతుందని గుర్తు చేశారు, సామ్రాజ్యవాద దేశాలకు తల్లి అయిన అమెరికా అనవసరమైన యుద్ధాలను ప్రోత్సహిస్తూ ఆదాయం దండుకుంటుందని గుర్తు చేశారు, గతంలో చాలా దేశాలు అమెరికా ప్రోద్భలంతో ఇతర దేశాలపై యుద్ధాలు చేసి వారిని అప్పులపాలు చేసిందని చరిత్ర తెలుపుతున్న ఇజ్రాయిల్ లాంటి దేశాలు అమెరికా ఉచ్చులోపడి పాలస్తీనా సహాయక శిబిరాలపైన దాడులు చేసి అక్కడ ప్రజలు దారుణంగా హతమార్చడం మానవత్వం ఉన్న ప్రతి మనిషి ఇది సరైన పద్ధతి కాదని చెప్పిన ఇజ్రాయిల్ దేశ%శీ% అహంకారంతో ముందుకు పోవడ మంచిది కాదన్నారు, అమెరికా ఉక్రెయిన్ దేశాన్ని ప్రోత్సహించి రష్యాపై యుద్ధం చేయిస్తూ ఉక్రెయిన్ సర్వనాశనం చేసిందని, ట్రంపు అధికారం చేపట్టిన తర్వాత ఉక్రేయిన్ కు యుద్ధ సహాయం కోసం అడుగుతే అక్కడ ఖనిజా సంపద కావాలని డిమాండ్ చేస్తూ ఉక్రెయిన్ పౌరుల జీవితాలతో ఆడుకున్నారని తెలిపారు, ఇజ్రాయిల్ దేశం అమెరికా సామ్రాజ్యవాదం ఉచ్చులో పడి భవిష్యత్తును సర్వనాశనం చేసుకోకుండా పాలస్తీలతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు మహమూద్, నాగ స్వాములు, పార్వతయ్య, షేక్ష, బడే భాష, వేణు, మత్తయ్య, రాజు, మరియు సిఐటియు కార్మికులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

**– కూటమి ప్రభుత్వానికి సిపిఎం నేతల డిమాండ్**



మన గళం,కర్నూలు పాతబస్తీ : ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం పార్టీ నగర కార్యదర్శి ,ఎం రాజశేఖర్ డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని 11వ వార్డు ఎర్రబురుజు సచివాలయం ముందు, ఎం శ్రీనివాసులు అధ్యక్షతన ధర్నా జరిగింది .ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ నగర కార్యదర్శి ఎం రాజశేఖర్ కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్.ఎం.డి షరీఫ్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు, డి.పార్వతయ్య నగర కమిటీ సభ్యులు వి నాగస్వాములు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 9వ తేదీన జీవో నెంబర్ 30 లో విడుదల చేస్తూ విజయ విధానాలను ప్రకటించింది. పట్టణ ప్రాంతాలలో నివసించే ప్రజానీకానికి అర్హులైన ఇండ్లు లేని నిరుపేద ,మధ్యతరగతి ప్రజానీకానికి ,రెండు సెంట్లు స్థలము ఇచ్చి ఐదు లక్షల రుణ సౌకర్యం కల్పిస్తామని విధానాలు ప్రకటించినప్పటికీ దీని గురించి ఎక్కడ కూడా ప్రచారం చేయడం లేదని వారు విమర్శించారు .దీన్నిబట్టి ప్రజల పైన కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని వివరించారు. కర్నూలు నగరంలో చాలా ప్రాంతాలలో బడుగు ,బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, వారు బాడుగలు చెల్లించలేని దుస్థితిలో ఉన్నారని, ఇంకొకవైపు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి మరి ప్రజల పైన మోయలేని, భారాలు వేస్తా ఉన్నాయని, దీనికి తోడుగా పెట్రోల్, డీజిల్ , గ్యాస్ ,తో పాటు కరెంటు బిల్లులను విపరీతంగా పెంచేశారని ,ప్రజలు అష్ట కష్టాలతో జీవితాలను గడుపుకొని వస్తున్నారని, అటువంటి వారికి కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీ ని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం విచారించి రెండు సెట్ల స్థలముతో పాటు ,ఇళ్ల నిర్మాణం కోసం 10 లక్షల రుణ సహాయం చేయాలని, వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం పీ సుంక్కన్న,ప్రకాష్ ,మణికుమార్, స్రవంతి, కళావతి ,ప్రవళిక నాగ మధు, కన్నా, మహేశ్ , శేఖర్, శ్రీనివాసులు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# యోగ మన వారసత్వ సంపద

**– విద్యార్థులు విద్యతో పాటు యోగాభ్యాసం చేయాలి**
**– రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి. జి.భరత్**




మన గళం,కర్నూలు సిటి : వేల సంవత్సరాల నుండి వస్తున్న యోగా మన వారసత్వ సంపద అని చదువుతోపాటు ఆరోగ్యంగా ఉండడం కూడా ముఖ్యమని రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి. జి.భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కర్నూలు నగరం లోని అవుట్ డోర్ స్టేడియం లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు, ఎన్.సి.సి.విద్యార్థులు, మహిళలు, అధికారుల భాగస్వామ్యంతో 5 వేల మంది తో నిర్వహించిన థీమాటిక్ యోగా ప్రదర్శన నిర్వహించారు.. యోగా శిక్షకులు మునిస్వామి యోగా ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు వేయించారు. యోగ కార్యక్రమం నిర్వహణ తరువాత మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ యోగా కార్యక్రమం లో పాల్గొనేందుకు దాదాపు 11 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకుని, కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అభినందించారు. యోగా ఐదు వేల సంవత్సరాల నుండి మనకు వారసత్వంగా వస్తోందని, యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు యోగా చేయడం అలవర్చుకోవాలని తెలిపారు..ప్రజలకు యోగా పట్ల అవగాహన కల్పించి, ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో మే 21 నుండి జూన్ 21 వరకు నెల రోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారన్నారు. ఈనెల 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేశ ప్రధానమంత్రి ముఖ్యమంత్రి విశాఖపట్నం సముద్రతీరంలో ఐదు లక్షల మందితో నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో పాల్గొంటున్నారని, ఈ యోగా కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లో స్థానం సంపాదించేలాగా ఉంటుందని మంత్రి తెలిపారు. కర్నూలు అవుట్డోర్ స్టేడియం అభివృద్ధికి, అవసరమైన చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగా వాకింగ్ ట్రాక్ తదితర సదుపాయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రీన్ కో ద్వారా సీ ఎస్ ఆర్ నిధులు రూ.4 కోట్లతో టిడ్ కో గృహ సముదాయాల దగ్గర అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం ను నిర్మించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో కర్నూలు జిల్లా అగ్రగామిగా ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర , స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలను చేపట్టారని, అవి విజయవంతం అయ్యాయని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఒక నెల రోజుల పాటు" యోగాంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరిస్తున్నారని తెలియజేశారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమం కూడా విజయవంతం చేయాలని, అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపేలా సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో 10 లక్షల 96 వేల మంది కర్నూలు జిల్లా నుండి రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని , ఇది రాష్ట్రంలోనే అత్యధిక నమోదు అని తెలిపారు. కర్నూలు జిల్లా వాసులు ప్రతి కార్యక్రమంలోనూ ముందుండి విజయవంతం చేయాలన్న తపన తో సహకరిస్తున్నారని, ఇందువల్ల ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో కర్నూలు జిల్లా మొదటి ఐదు స్థానాల్లో ఉంటోందని తెలిపారు. ఈనెల 21వ తేదీ న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నారని, 5 లక్షల మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాలో జూన్ 21న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ 2 లక్షల 40 వేల సింహ భాగం రిజిస్ట్రేషన్లు కర్నూలు మున్సిపల్ శాఖ ద్వారా నమోదు కావడం గర్వంగా ఉందని తెలిపారు. పారిశుధ్య కార్మికుల చే యోగా నిర్వహణ అందరి సహకారంతో విజయవంతం చేశామని తెలిపారు. ఈ యోగ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, సీఈవో సెట్కూర్ వేణుగోపాల్, జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి , ఎన్ సి సి కల్నల్ ప్రసాద్, డిస్ డి ఓ భూపతి రావు, కార్పొరేటర్ పరమేష్, ఆయుష్ డాక్టర్ ప్రసాద్ , మునిస్వామి , జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్, జిల్లా అధికారులు మున్సిపల్ శాఖ సిబ్బంది మెప్మా సిబ్బంది ఎన్సిసి విద్యార్థులు, సాధారణ ప్రజలు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పేదలకు ఇళ్ల స్థలాలివ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

**– ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి**
**– సీపీఎం న్యూ సిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు కే.ప్రభాకర్ డిమాండ్**

మన గళం,కర్నూలు సిటి : కర్నూలు మున్సిపల్ పరిధిలోని 36 వ వార్డు పెద్దపాడు గ్రామ సచివాలయం ముందు నిరుపేదలైన పేదలందరికీ- ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం పార్టీ పెద్దపాడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం ముందు ధర్నా కార్యక్రమం సిపిఎం పెద్దపాడు గ్రామ పార్టీ కార్యదర్శి గోపి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం పార్టీ న్యూ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ ప్రజలదేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు, నిర్మించి ఇవ్వాలనే ఆలోచన చేయకపోవడం విడ్డూరంగా ఉందని పేదలుగా గుర్తించిన వారందరికీ ఇంటి స్థలాలు చూపించాలని వారు డిమాండ్ చేశారు . రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 9వ తేదీన జీవో నెంబర్ 30 ని విడుదల చేస్తూ విధి విధానాలను ప్రకటించింది. పట్టణ ప్రాంతాలలో నివసించే ప్రజానీకానికి అర్హులైన వారికి ఇండ్లు లేని నిరుపేద ,మధ్యతరగతి ప్రజానీకానికి ,రెండు సెంట్లు స్థలము ఇచ్చి ఐదు లక్షల రుణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించినప్పటికీ దీని గురించి ఎక్కడ కూడా ప్రచారం చేయడం లేదని విమర్శించారు దీన్నిబట్టి ప్రజల పైన కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని వివరించారు. కర్నూలు నగరంలో చాలా ప్రాంతాలలో బడుగు ,బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, వారు బాడుగలు చెల్లించలేని దుస్థితిలో ఉన్నారని, ఇంకొకవైపు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి మరి ప్రజల పైన మోయలేని, భారాలు వేస్తా ఉన్నాయని, దీనికి తోడుగా పెట్రోల్, డీజిల్ , గ్యాస్ ,తో పాటు కరెంటు బిల్లులను విపరీతంగా పెంచేశారని ,ప్రజలు అష్ట కష్టాలతో జీవితాలను గడుపుకొని వస్తున్నారని, అటువంటి వారికి కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీ ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటాల ద్వారా పేదలందరికీ నివాసయోగ్యమైన కొట్టాలు వేయించాలనిప్రయత్నించగా అధికారులు హుటాహుటిన అక్కడికి వచ్చి మీరు జాబితా ఇవ్వండి మేము మూడు నెలల్లో సమస్యలు పరిష్కరించి ఇళ్ల స్థలాల మంజూరు చేస్తామని చెప్పిన అధికారులు ఇంతవరకు ఆ ప్రస్తావన తీసుకురావడం లేదని ఇప్పటికైనా



ప్రభుత్వం స్పందించి అర్జీలు ఇచ్చిన వారందరికీ ఇళ్ల స్థలాలు చూపించి ఇల్లు నిర్మించుకోవడానికి లోన్లు మంజూరు చేయాలని లేకుంటే తిరిగి భూపోరాటం ద్వారా పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంచి కొట్టాలు వేయిస్తావని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు అర్హులైన వారందరికీ ప్రభుత్వం విచారించి రెండు సెట్ల స్థలముతో పాటు ,ఇళ్ల నిర్మాణం కోసం 10 లక్షల రుణ సహాయం చేయాలని, వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. పార్టీ శాఖ కార్యదర్శి గోపినాథ్, వరలక్ష్మి, మహేష్, రాజు, కృష్ణ, చిరంజీవి,విసన్న,రమేష్, రవి, నారాయణ, రాజ్యలక్ష్మి, మంజుల నాగమ్మ,, చంటమ్మ,సునీత,వరాలు చిట్టెమ్మ మరియు ప్రజలు పెద్ద పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .

# ఎం.పి.బైరెడ్డి శబరికి...ఘన సన్మానం



మన గళం,కర్నూలు సిటి : భారతదేశం తరుపున బ్రిక్స్ సమావేశంలో పాల్గొన్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని రెడ్డి సంక్షేమ సంఘం ఘనంగా సన్మానించింది. మంగళవారం బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నేతలు బిర్రు ప్రతాపరెడ్డి,భజరంగ్ దళ్ ,ప్రతాపరెడ్డి ,తదితరులు మాట్లాడుతూ రాయలసీమ నుండి ఒక రెడ్డి బిడ్డ ఇంతటి గొప్ప స్థానం సంపాదించడం యావత్ రెడ్డి సామాజిక వర్గానికి గర్వకారణమన్నారు. ఎం.పి.బైరెడ్డి శబరి ఇంకా ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు.

# విజయవంతంగా ఎన్.సి.డి 3.0 సర్వే పై లాట్ క్వాలిటీ అసెస్మెంట్



మన గళం,కర్నూలు వైద్యం : జిల్లాలోని అయిదు గ్రామాల్లో విజయవంతంగా నాన్ కమ్యునకబుల్ వ్యాధుల 3.0 సర్వే పై విజయవంతంగా క్వాలిటీ అసెస్మెంట్ సర్వే నిర్వహించామని కమ్యూనిటీ మెడిసిన్ విభాగపు అధిపతి డాక్టర్ సుధా కుమారి, ప్రొఫెసర్ సింధియా శుభప్రదలు మంగళవారం తెలిపారు. గౌరవ ప్రిన్సిపల్ సెక్రెటరీ డి.ఎం.ఈ ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ సూచనలు సలహాలతో కమ్యూనిటీ మెడిషన్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని ఐదు గ్రామాల్లో జిల్లాలో ఐదు మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఏడు మంది పీజీలు 50 మంది ఇంటర్న్లు వైద్యుల బృందం ఆధ్వర్యంలో లాట్ క్వాలిటీ అసెస్మెంట్ సర్వే నిర్వహించడం జరిగిందని తెలిపారు. గతంలోనే నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ 3.ఓ సర్వే జరిగిన విధానాన్ని ఎంత మేరకు సమర్థవంతంగా నిర్వహించడం జరిగింది అన్న దానిపై క్వాలిటీ అసెస్మెంట్ చేశామని వారు తెలిపారు. జిల్లాలోని బుక్కాపురం,గోరంట్ల, సి.బెళగల్ చింత మాన్ పల్లి, ఆరెకల్ మాచాపురం గ్రామాల్లో రాండంగా 600 శాంపిల్స్ అసెస్మెంట్ కొరకు ఎంపిక చేసుకోవడం జరిగిందని గ్రామాల్లో వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య బృందం మళ్లీ పరీక్షలు చేసి గతంలో జరిగిన సర్వేపై అసెస్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు. క్వాలిటీ అసెస్మెంట్ సర్వే పై కూడా మళ్లీ అసోసియేట్ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేయించడం జరిగిందని తెలిపారు. సేకరించిన 600 వందల శాంపిల్స్ ను విశ్లేషణ చేసి పై అధికారులకి నివేదిక అందిస్తామని వారు తెలిపారు. ఈ సర్వేలో అసోసియేట్ ప్రొఫెసర్లు డా. అరుణ డా. రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. పుష్పలత డా. ప్రవీణ డా. వైష్ణవి, డాక్టర్ ప్రసన్న రాణి లెక్చరర్ సురేష్ కుమార్, సూపర్ వైజర్ సాయిరాం, పీజీలు డా.అపర్ణ డా. మౌనిక, డా. నర్మద డా. కార్తీక్, డా.సబిహ డా. సౌమ్య డా. నస్రత్ లు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీలోని పోస్టల్ భర్తీపై దళారుల మాట నమ్మొద్దు

మన గళం,కర్నూలు వైద్యం : జిల్లాలోని మెడికల్ కాలేజీలో వివిధ కేటగిరీలు చెందిన పోస్టుల భర్తీ విషయంలో ఫైనల్ మెరిట్ లిస్టు పూర్తిగా నియమ నిబంధనల మేరకు తయారు చేశామని ఈ పోస్టుల భర్తీలో ఎటువంటి అక్రమాలకు తావు లేదని ఎవరైనా దళారులు ప్రలోభాలకు గురి చేస్తే నమ్మవద్దని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ మంగళవారం తెలిపారు. ప్రలోభాలకు గురి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు అదేవిధంగా 19 జరుగుతున్న కౌన్సిలింగ్లో కార్డియాలజీ టెక్నీషియన్ పోస్టులకు కౌన్సిలింగ్ ఉండదన్నారు. కార్డియాలజీ టెక్నీషియన్ పోస్టుల కౌన్సిలింగ్ తేదీ మరలా ప్రకటిస్తామన్నారు. సర్టిఫికెట్స్ జెన్యూన్ అని తేలిన తర్వాతనే వేతనాలు చెల్లిస్తామని సర్టిఫికెట్లు ఫేక్ అని తేలితే వారిపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని కూడా తెలిపారు.

# జమ్మన్న మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

మన గళం,కర్నూలు సిటి : ఉపాధ్యాయ కర్నూలు జిల్లాఉద్యమ నిర్మాత వై జమ్మన్న మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సిపిఎం జిల్లా నాయకులు అన్నారు వై జమ్మన్న మృతదేహాన్ని సందర్శించి ఆయనకు నివాళులు అర్పించారు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.ఎస్. రాధాకృష్ణ ఎం.డి.అంజిబాబు ఎం.డి ఆనంద్ బాబు ప్రజాశక్తి మేనేజర్ నరసింహ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత స్థాయి ఎదగడానికి ఎంతో కృషి చేశారని వారు అన్నారు ఆయన పని చేసే ప్రతి చోట విద్యార్థులకు నిరంతరం మెలకువలు నేర్పుతూ వారు ఉన్నత స్థాయికి ఎదగడానికి తోడ్పడేవారని కొనియాడారు అంతేకాకుండా ప్రజా ఉద్యమాలకు వెన్ను దన్నుగా ఉంటూ, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటాలు జరిగిన సందర్భంలో ప్రజల తరఫున నిలబడే వారని కొనియాడారు జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ ఉద్యమాలకే కాకుండా ప్రజా ఉద్యమాలకు కూడా తోడ్పాటున అందించేవారు అని అన్నారు వామపక్షప్రజాతంత్ర శక్తులను బలోపేతం చేయడంలో ఆయన కృషి ఎంతో ఉందని అన్నారు ఆయన లేని లోటు తీర్చలేదని జమ్మన్న గారి ఆశయ సాధన కోసం ఉద్యమకారులందరూ కృషి చేయవలసిన అవసరం ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి అడ్వర్టైజ్మెంట్ ఇంచార్జ్ రాజు ప్రజాశక్తి విలేకరులు సత్యం మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నాం



- క్రీడల అభివృద్ధికి స్టేడియాల ఏర్పాటు
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి వర్యులు టీజీ భరత్


మన గళం,కర్నూలు రూరల్ : కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కి అన్ని విధాలుగా చర్యలుతీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి వర్యులు టీజీ భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామం జగన్నాథ గట్టు వద్ద ఉన్న టిడ్కో గృహాలకు ఎదురుగా ఆరు ఎకరాల్లో గ్రీన్ కో కంపెనీ సిఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం, క్రీడా కాంప్లెక్స్ కు మంత్రి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ల, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యామ్ బాబు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు..ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ హైవే దగ్గర్లో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమన్నారు... ఈ స్టేడియం ఏర్పాటు కర్నూలు జిల్లాలో అభివృద్ధికి చిహ్నంగా నిలుస్తుందన్నారు.. అదే విధంగా కోడుమూరు నియోజకవర్గంలో బాల సాయిబాబా స్కూల్ పక్కన ఉన్న ఏసీఏ క్రికెట్ గ్రౌండ్ లో కూడాస్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.. క్రీడల వల్ల జీవితంలో కూడా చాలా క్రమశిక్షణ కలిగి ఉంటారని మంత్రి తెలిపారు... గ్రీన్ కో కంపెనీ పి 4 విధానం ద్వారా ముందుకు వచ్చి సి ఎస్ ఆర్ కింద స్టేడియం నిర్మించడం అభినందించాల్సిన విషయమన్నారు.. అదే విధంగా ప్రపంచంలోనే అతి పెద్దదైన పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కర్నూలు జిల్లాలో ఏర్పాటు కావడం సంతోషంగా ఉందన్నారు..జిల్లాలో మరిన్ని మంచి పరిశ్రమలు తీసుకొని వచ్చి ఉపాధి అవకాశాలు కూడా కల్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు... ప్రతి నియోజకవర్గంలో ఎమ్ఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాల కల్పనకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు..పత్తికొండ లో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ను కూడా త్వరలోనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు . జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలు అయిన తిరుపతి, అనంతపురం, కడప లలో మంచి స్టేడియం లు ఉన్నాయన్నారు..అదే విధంగా కర్నూలులో నిర్దిష్ట మరియు కేంద్రీకృత స్టేడియం ఒకటి ఉండాలనే ఉద్దేశ్యంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో బాల సాయిబాబా స్కూల్ పక్కన ఉన్న ఏసీఏ క్రికెట్ గ్రౌండ్ లో రెండు స్టేడియం లను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక స్టేడియం ఉంటే క్రీడాకారులకు ఎంతగానో లబ్ది చేకూరుతుందన్నారు... లక్ష్మీపురం గ్రామం జగన్నాథ గట్టు వద్ద ఉన్న టిడ్కో గృహాలకు ఎదురుగా క్రికెట్ స్టేడియం ను అభివృద్ధి చేయడమే కాకుండా క్రికెట్ తో పాటు బాస్కెట్ బాల్, కబడ్డీ, ఇండోర్ స్టేడియం షటిల్, స్విమ్మింగ్ తదితర అన్ని రకాల సదుపాయాలతో అత్యుత్తమ కేంద్రంగా తీర్చిదిద్దుతామని గ్రీన్ కో కంపెనీ ముందుకు రావడం జరిగిందన్నారు... ఇక్కడ పిల్లల ప్రతిభను గుర్తించి వారికి ఆహారం, వసతి సౌకర్యాలతో పాటు 15 సంవత్సరాల వరకు 40 మంది ప్రత్యేకమైన కోచ్ లతో ప్రత్యేక శిక్షణ ఇచ్చి క్రీడాకారులను బయటకు తీసుకొని రావాలనే ఉద్దేశ్యంతో ఈ స్టేడియం ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పాణ్యం నియోజకవర్గంలో పర్యటన కు వచ్చిన సమయంలో పి4 విధానం లో గ్రీన్ కో కంపెనీ వివిధ రంగాల అభివృద్ధికి రూ.10 కోట్లను ప్రకటించడం జరిగిందన్నారు... ఇప్పుడు రూ.4 కోట్లతో స్టేడియం ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఆరు నెలల సమయంలో స్టేడియం పూర్తి చేసే విధంగా గ్రీన్ కో కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకుంటున్నారన్నారు... స్టేడియం ఏర్పాటుకు 6 ఎకరాల భూమిని మున్సిపల్ కార్పొరేషన్ స్వాధీనం చేయడం జరుగుతుందన్నారు.. ఇక్కడ ఏర్పాటు చేయనున్న స్టేడియం ను క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కర్నూలు కి క్రికెట్ స్టేడియం రావడం చాలా సంతోషించాల్సిన విషయం అన్నారు.. కర్నూలు జిల్లా నుండి ఎంతోమంది క్రీడాకారులు బాగా రాణిస్తున్నారన్నారు.. గ్రీన్ కో వారి సహకారంతో లక్ష్మీపురం జగన్నాథ గట్టు వద్ద 6 ఎకరాలలో స్టేడియం, క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి, క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి భోజన, వసతి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు.. గ్రీన్ కో కంపెనీ యాజమాన్యం సిఎస్ఆర్ నిధుల కింద గ్రామాల్లో అభివృద్ధి పనులను చేస్తున్నారన్నారు.... చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు.. క్రీడల్లో బాగా రాణించినట్లయితే జీవితంలో స్థిరపడతారన్నారు.. విద్యార్థులందరూ తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని జీవితంలో ముందుకు వెళ్ళాలని ఎమ్మెల్యే కోరారు. పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యామ్ బాబు మాట్లాడుతూ కర్నూలులో గ్రీన్ కో ఈ ప్రాజెక్ట్ చేయడం చాలా అభినందించాల్సిన విషయమన్నారు.. ఈ ప్రాజెక్ట్ ద్వారా కర్నూలు జిల్లాకు మరింత అందం చేకూరుతుందన్నారు... మండల స్థాయిలో చాలా మంది క్రీడాకారులు ఉన్నారని, వారు అవకాశాల కొరకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వెళ్ళేవారన్నారు.. ప్రతి ఒక క్రీడాకారునికి న్యాయం జరిగే విధంగా గ్రీన్ కో వారి ద్వారా జిల్లా కలెక్టర్ కర్నూలు లో స్టేడియం ఏర్పాటు చేయించడం గర్వించ దగ్గ విషయమన్నారు... రాబోయే కాలం లో ఇలాంటి స్టేడియం లు మరిన్ని రావాలని, ఉమ్మడి జిల్లాలో ఉన్న విద్యార్థులు, క్రీడాకారులకు మరిన్ని మంచి అవకాశాలు రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం పి4 మోడల్ సంకల్పానికి ఇది ఒక ఉదాహరణ అన్నారు.. అధిక నెట్వర్క్ ఉన్న వ్యక్తులు ఎవరైతే ఉన్నారో వారు అందరూ సమాజానికి మంచి జరిగే విధంగా ఉండడమే పి4 మోడల్ అన్నారు. గ్రీన్ కో కంపెనీ లో ఏదైతే గ్రీన్ ఉందో అదే విధంగా ఇక్కడ ఏర్పాటు చేయనున్న స్టేడియం ను కూడా గ్రీన్ స్టేడియం గా అద్భుతంగా ఏర్పాటు చేయనున్నారన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. కర్నూలులో స్టేడియం ఏర్పాటు వల్ల ఎంతో మంది క్రీడాకారులు తయారవుతారన్నారు.. క్రీడల వల్ల విద్యార్థులకు మంచి భవిష్యత్ లభించే అవకాశం ఉందని, ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యం అన్నారు.. పరిశ్రమలు ఎన్నో తీసుకొని వచ్చేందుకు మంత్రి కృషి చేస్తున్నారన్నారు... అభివృద్ధి పనులకు కూడా తగిన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు.. కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, గ్రీన్ కో కంపెనీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, గ్రీన్ కోఅసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు..

# ఆధార్ కార్డు లేని దిక్కులేని అనాధల పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్



మన గళం,కర్నూలు లీగల్ : జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఆదేశాల మేరకు మంగళవారం సాథి కమిటీ మెంబర్స్ కర్నూలు వెంకటరమణ కాలనీ పంప్ హౌస్ ఎదుట నున్న ఇందిరానగర్ లో నిర్వహించిన తనిఖీలలో 22 మంది ఆధార్ కార్డు లేని పిల్లలను గుర్తించారు. వీరందరినీ సాథి కమిటీ వారు కర్నూలు న్యాయ సేవా సదన్ నందు సాథి కమిటీ చైర్మన్ అయిన లీలా వెంకట శేషాద్రి ముందు హాజరు పరిచారు. జడ్జి వీరిలో ఒకటి నుంచి ఐదు సంవత్సరాలు గల ఆడ పిల్లలందరిని వారి చదువు కోసం,వారి ఉజ్వల భవిష్యత్తు కొరకు పెద్దపాడు నందుగల బాలసదన్ లో,మగ పిల్లలను పుల్లారెడ్డి కాలేజీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న విజ్ఞాన పీఠంలో వారందరినీ చేర్పిస్తారని వారితో చెప్పడం జరిగింది వారికి మెరుగైన విద్య అందించడంతో పాటు వారికందరికీ ఆధార్ కార్డులు ఇప్పించే ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం జడ్జి మాట్లడుతూ గౌరవనీయులైన జాతీయ న్యాయ సేవల అథారిటీ 13-05-2025న సాథి( ప్రచార పత్రాన్ని “సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సెస్ టు ట్రాకింగ్ %డ% హోలిస్టిక్ ఇంక్లూజన్”ను ప్రారంభించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న దిక్కులేని/అనాథ పిల్లలను గుర్తించడం మరియు మద్దతు ఇవ్వడం ఈ ప్రచారం యొక్క ప్రధాన లక్ష్యం, ఆధార్ నమోదు, చట్టపరమైన సహాయం మరియు సంక్షేమ పథకాలకు అనుసంధానం చేయడం ద్వారా ఏ బిడ్డకు చట్టపరమైన గుర్తింపు లేదా హక్కులు మరియు హక్కులను పొందే అవకాశం లేకుండా ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెల్లి వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద,తదితరులు పాల్గొన్నారు.

# డి.ఇ.ఓ.కి వినతిప్రతం



మన గళం,కర్నూలు విద్య : సోమవారం డి ఈ ఓ ఎస్ సామ్యూల్ పాల్ ని కోడుమూరు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ అనంతరత్నమ్ మాదిగ, ఐ ఎన్ యు సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎం ఖాద్రి పాషా ,జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ ఎద్లూరి లాజరస్ కాంగ్రెస్ నాయకులు జె నాగరాజు, జె కుమార్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ ఈనాటి తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తల్లికి వందనం స్కీం ద్వారా కుటుంబంలో ఎంతమంది చదువుకుంటే అంతమందికి విద్యార్థి విద్యార్థినీల తల్లుల అకౌంట్లో చదువుకోడానికి నగదును కేటాయించడం జరిగిందన్నారు. అయితే ఇది అదునుగా చూసుకుని ప్రైవేటు స్కూల్ యజమాన్యం వారు అక్రమంగా అధిక ఫీజులు పెంచడం జరిగింది కొంతమంది విద్యార్థిని తల్లిదండ్రులు ఎందుకు ఈ విధంగా అమాంతంగా ఫీజులు పెంచారని అడగగా మీకు ఉచితంగా ప్రభుత్వము నుండి తల్లికి వందనం స్కీం ద్వారా నగదు వస్తుంది కనుక మేము ఫీజులు పెంచామని కొన్ని ప్రైవేటు సంస్థలు చెప్పకనే చెబుతున్నాయి కావున ప్రభుత్వము ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించి ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాన్ని పిలిపించి అధిక ఫీజులను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. లేదంటే విద్యార్థుల తల్లిదండ్రులను ,ప్రజలను కలుపుకొని కాంగ్రెస్ పార్టీ తరపున ధర్నాలు చేయడానికి కూడా వెనకాడమని చెప్పారు.

# ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

- ఏఐవైఎఫ్ నేతల విమర్శ

మన గళం,కర్నూలు సిటి : ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి నాగరాముడు, జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు విమర్శించారు మంగళవారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు జూన్ 15 జులై 15 వరకు ఏఐవైఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ/ ఉపాధి/నిరుద్యోగ భృతి సాధనకై ఐదు లక్షల అర్జీలను రాష్ట్ర గవర్నర్ కు , సీఎం కు పంపించే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా నాగరాముడు శ్రీనివాసులు మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను పూర్తిగా మోసం చేసిందని 40 సంవత్సరాల రాజకీయం అనుభవం ఉన్న నన్ను గెలిపిస్తే రాష్ట్రంలో సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని , అలా చేయలేని పక్షంలో ప్రతి నిరుద్యోగికి 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తానని ఆమె ఇచ్చి సంవత్సరం పూర్తి అయిన ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ మినహాయించి ఏ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు ముఖ్యమంత్రి గారికి యువతకు ఉపాధి కల్పించే విషయంలో ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఇప్పటికి నాలుగు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉండేదని అయితే కేవలం 16 వేల పోస్టులకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మిగతా శాఖల ఉద్యోగాల గురించి గానీ నిరుద్యోగ భృతి గాని మర్చిపోయారని విమర్శించారు ఎన్నికల హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న 2 లక్షల 60 వేల వాలంటరీల ను తొలగించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయిందని కేకులు కట్ చేసుకుని సంబరాలు చేసుకునే పాలకులు నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ఏం చేశారని వారి ప్రశ్నించారు కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకుండా యువతను నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగమైన కల్పించండి , లేదంటే స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయండి, లేదంటే యువగలం పాదయాత్రలో నిరుద్యోగ భృతి కి ప్రణాళికల సిద్ధం చేశామన్న చెప్పిన విధంగా నిరుద్యోగ భృతి అయిన ఇప్పటివరకు ప్రతి ఒక్కరికి రావలసిన 36000 తోపాటు ప్రతి నెల 3000 ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర గవర్నర్ కి , సీఎం, నిరుద్యోగుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల అర్జీలు పంపించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపునివ్వడం జరిగింది కావున అందులో భాగంగా ఈనెల 20వ తేదీ శుక్రవారం నాడు ఉదయం 10 గంటల నుండి కర్నూలు కలెక్టర్ కార్యాలయాల దగ్గర అర్జీలు పంపించే కార్యక్రమం జరుగుతుంది కావున అధిక సంఖ్యలో యువతీ యువకులు నిరుద్యోగులు పాల్గొని ఏఐవైఎఫ్ ఉద్యమానికి తోడ్పడడమే కాకుండా ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని వారి పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, బిసన్న, నగర నాయకులు చంటి, కాసిం, అఖిల్, శివ, రాజేష్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి: కోడుమూరు విద్యుత్ శాఖ ఏ.ఈ. మధుసూదన్




మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో ప్రయోజనాలు ఉన్నాయని కోడుమూరు విద్యుత్ శాఖ ఏఈ మధుసూదన్ పేర్కొన్నారు. మంగళవారం కోడుమూరు పట్టణంలోని పాత బస్టాండ్ లో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రాయితీతో ఇంటిపైన సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ ఆదా చేసుకోవచ్చని ఆయన వివరించారు. కనీసం 10 చదరపు మీటర్లు లేదా 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సూర్య ఘర్ ద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారవుతామన్నారు. ఒక కిలో వాట్ కి రూ. 30 వేలు, 2 కిలో వాట్లకు రు 60 వేలు, అలాగే 3 కిలో వాట్లకి రూ 78 వేలు సబ్సిడీ వస్తుందని ఏఈ వివరించారు. ఈ కార్యక్రమంలో టాటా కంపెనీ సోలార్ పవర్ ఏజెన్సీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మనోజ్, వంశీకృష్ణ, టెక్నీషియన్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## చిగరమానుపేట లో క్రిస్టియన్ సమాధుల పడిపోయిన సైడ్ వాల్ ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



మన గళండోన్ మున్సిపల్ 16వ వార్డు సిపిఐ కౌన్సిలర్ పి.సుంకయ్య మరియు డోన్ సమైక్య క్రిస్టియన్ కమిటీ పెద్దలు జాకపాల్, గద్దం రాజశేఖర్,భాస్కర్, సిపిఐ పట్టణ కార్యదర్శి మోటారాముడు సహాయ కార్యదర్శి పుల్లయ్య శాఖ కార్యదర్శి అబ్బాస్ ల విజ్ఞప్తి మేరకు చిగరమాను పేట లో క్రిస్టియన్ సమాధుల సైడ్ వాల్ ఇటీవల కురిసిన భారీ వర్షం వలన కూలిపోయిన సైడ్ వాల్ ను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ వైస్ చైర్మన్ హరికిషన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, డి ఈ, ఏఈ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కమిషనర్ మున్సిపల్ అధికారులు సమైక్య క్రిస్టియన్ సమాధుల సైడ్ వాల్ వెంటనే నిర్మాణం ఏర్పాటు చేయుటకు మున్సిపల్ డి ఈ ఏయ్ ని ఆదేశించారు. అలాగే 16వ వార్డులో గుత్తి మెయిన్ రోడ్డు చిగరమాను పేట మసీదు దగ్గర నుండి భగత్ సింగ్ విగ్రహం వరకు సైడ్ పెద్ద కాలువను తొందర్లో నిర్మాణాన్ని పూర్తి చేయాలని వార్డు కౌన్సిలర్ పి.సుంకయ్య కోరగా కాలువ నిర్మాణాన్ని తొందర్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డులో ఇంకా వీధిలైట్లు త్రివర్ణ కాలనీ హొసన్న మందిర్ విడోస్ కాలనీ సర్వోత్తమ రెడ్డి నగర్ లో కాలువలు సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని మంచి నీళ్లు ఇబ్బందు లేకుండా సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమైక్య క్రిస్టియన్ కమిటీ పెద్దలు స్వామ్యూల్ చిట్టెం బాబు, భాస్కర్ బాబు జెర్మియా వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మార్పులతో నగర రూపురేఖలు మార్చాలి

- నగరపాలక అధికారులతో మంత్రి టీజీ భరత్
- ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాలపై సమీక్ష
- అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి
- బ్యానర్లు, పోస్టర్లు అతికించడం మానుకోకపోతే కేసులు



మన గళం, నగర రూపురేఖలు మార్చేందుకు అవసరమైన మార్పులు చేపట్టి, కర్నూలును రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్, నగరపాలక అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ యస్.రవీంద్ర బాబుతో కలిసి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ముందుగా గుత్తేదారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, లెస్‌లకు 5% కంటే ఎక్కువ పోవద్దని సూచించారు. 5% కంటే ఎక్కువ లెస్‌లకు టెండర్ వేసిన పనులపై, క్వాలిటీ కంట్రోల్ బోర్డు ద్వారా నాణ్యత ప్రమాణాలు తనిఖీలు చేశాకే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అదే విధంగా పనులు దక్కించుకుని ప్రారంభించకుండా జాప్యం చేస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు. అనంతరం పట్టణ ప్రణాళిక విభాగ అధికారులతో, ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడారు. నగరాన్ని సుందరంగా, అందంగా ఉండాలంటే పట్టణ ప్రణాళిక సిబ్బంది పర్యవేక్షణ చాలా కీలకమైనదన్నారు. ఆక్రమణలు ఉపేక్షించొద్దని, దీనిపై పైస్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వెండర్స్ జోన్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలని, బహిరంగ ప్రదేశాల రహదారులపై తోపుడు బండ్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి వ్యాపారులు ఎంతమంది ఉన్నారో, అనుమతులు ఎంత మంది తీసుకున్నారో వంటి వివరాలను వారంలోగా తనకు అందజేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువ ఉన్న ప్రదేశాల్లో రహదారుల ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఆలస్యం చేయొద్దని స్పష్టం చేశారు. రహదారులపై, కూడళ్లపై బ్యానర్లు, పోస్టర్లు అతికించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత వ్యక్తులు జరిమానాతో వినకపోతే, కేసులు నమోదు చేసేందుకు వెనకాడొద్దని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించే ఆక్రమణలు తక్షణమే తొలగించాలని, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు అన్వేషించి వెండర్ జోన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాంతాలు సుందరంగా తీర్చిదిద్దేందుకు, క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది ప్రణాళిక రూపొందించాలని, అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీల ప్రసాద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ అంజాద్ బాష, కార్పొరేటర్ పరమేష్, డిఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

## పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

- ప్రపంచశాంతిని నెలకొల్పాలి సామ్రాజ్యవాదం నశించాలి

మన గళం,కర్నూలు బిర్లాగేట్ : కర్నూలు నగరంలోని బిర్లాగడ్డ సర్కిల్ నందు సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో పాలస్తీనా పై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని కోరుతూ సంఘీభావ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి సిఐటియు నగర నాయకులు బి రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు సిఐటియు నగర అధ్యక్షులు ఆర్ నరసింహులుగారులుకార్యక్రమానికి విచ్చేసిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇజ్రాయిల్ అమెరికా పోద్బలంతో నిరంకుశ ధోరణితో పాలస్తీనా దేశంపై యుద్ధం ప్రకటించి దాడులు చేస్తూ నివాస ప్రాంతాలపై స్కూళ్లపై హాస్పిటల్స్ పై కర్కశంగా జాలి దయ లేకుండా బాంబు దాడులు చేసి60 వేల మందికి పైగా ప్రాణాలు తీసింది. వేలాదిమంది గాయాల పాలైనారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో పిల్లలు మహిళలువృద్ధులు ఎక్కువగా ఉన్నారు. పాలస్తీనా ప్రజలకు ఆహారం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల శిబిరాల పైన కూడా దుర్మార్గంగాబాంబుదాడులు చేస్తున్నదిఒకవైపుఐక్యరాజ్యసమితి యుద్ధం వద్దని ఎన్నిసార్లు నివారించిన వినకుండా దాడులు చేస్తున్నది. కాల్పుల విరమణ చేస్తున్నామని చెబుతూ మాట తప్పి అమెరికా సామ్రాజ్యవాద దేశం చెప్పినట్లు పాలస్తీనా ప్రజలపై మరలబాంబులవర్షంకురిపిస్తున్నది. అందువలన ఈ చర్యలను సిఐటియు తీవ్రంగావ్యతిరేకిస్తున్నది ఇజ్రాయిల్అమెరికాసామ్రాజ్యవాదం నశించాలిప్రపంచశాంతినెలకొల్పాలని కోరుతూ పాలస్తీనా




ప్రజలకు సంఘీభావం తెలియజేస్తున్నామని అన్నారు ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని ప్రపంచ శాంతిని నెలకొల్పాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిర్లాగడ్డ హమాలి యూనియన్ నాయకులు సూర్య రాజు మధు సురేష్ భాషఆటో యూనియన్ నగర నాయకులు ఎస్ మాలిక్ జయన్న మట్టిపని కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

## చట్ట ప్రకారం జీఎస్టీ సజావుగా చెల్లించేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

కర్నూలు కలెక్టరేట్ : చట్ట ప్రకారం జీఎస్టీ సజావుగా చెల్లించేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని క్యాంప్ కార్యాలయంలో జీఎస్టీ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి పన్ను చెల్లింపు దారులు సక్రమంగా జీఎస్టీ చెల్లించేలా కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ కు సహకరించాలని అధికారులను ఆదేశించారు.. రిజిస్టర్ చేసుకోకుండా వ్యాపారాలు చేసేవారు, కాంట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేయించి జిఎస్టి పన్ను చెల్లించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జిఎస్టి చట్ట ప్రకారం డిఫాల్టర్ల ప్రాపర్టీస్ ను గుర్తించి, రికవరీ చేయించడంలో రెవిన్యూ శాఖ అధికారులు కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ల కు తగిన సహకారం అందజేయాలని ఆదేశించారు. అలాగే నకిలీ డాక్యుమెంట్ల తో అక్రమ రవాణా చేసే వారి విషయంలో మైనింగ్ శాఖ, రవాణా శాఖ అధికారులు కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ తో సమన్వయంతో పని చేయాలని సూచించారు. అలాగే ఇంజనీరింగ్ శాఖలు ఆయా శాఖలకు సంబంధించిన కాంట్రాక్టర్లు జిఎస్టి పన్ను సక్రమంగా చెల్లించేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్రైవేట్ సంస్థలు, ఔట్సోర్సింగ్, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులు ప్రొఫెషనల్ టాక్స్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. ఆయా శాఖలకు సంబంధించి జీఎస్టీ పన్ను చెల్లింపు పై సంపూర్ణ అవగాహన కోసం సంబంధిత శాఖల అధికారులతో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ కామాక్షియల్ ట్యాక్స్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెల సమన్వయ సమావేశాన్ని నిర్వహిస్తా మని, ఆ లోపు ఆయా ప్రభుత్వ శాఖలు



ఎందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు .

సమావేశంలో కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్మెంట్ జాయింట్ కమిషనర్ సుధాకర్ రావు, డిప్యూటీ కమిషనర్ సురేష్, ఇంచార్జి డిఆర్ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, డ్వామా పిడి వెంకటరమణయ్య, పత్తికొండ ఆర్డీఓ భరత్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీఓ భాస్కర్, గనుల శాఖ అధికారి రవిచంద్, డిటిసి శాంత కుమారి, తదితరులు పాల్గొన్నారు..

## వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం




మన గళం కోడుమూరు : కర్నూలు జిల్లా కోడుమూరు మండలం కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని తెలుగు కొండన్న పొలంలో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ పంటలను పరిశీలించి రైతులతోసమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఏడీఏ ఎన్. సాలు రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు. ఖరీఫ్ సీజన్ మొదలు అయినందువలన పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రారంభించడం జరిగింది, ప్రతి మంగళవారము, బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించబడును. కోడుమూరు పట్టణంలో పత్తి పంటలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో రైతులతో పత్తి పంటలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చర్చించడం జరిగినది. పత్తి పంట విత్తి 15 రోజులు గా వస్తున్నందున రసాయని ఎరువును ఎకరాకి ఒక బస్తా చొప్పున డిఏపి గాని లేదా కాంప్లెక్స్ గాని వేసుకోవాల్సిందిగా తెలియజేశారు. విత్తన టైంలో రసాయనిక ఎరువును వేసి ఉంటే ఇప్పుడు అవసరం లేదు. అలాగే 20 రోజుల తర్వాత రసం పిలిచే పురుగు గాని దోమ గాని కనిపించిన ఎడల వేపను నూనె పిచికారి చేసుకోవాల్సిందిగా చెప్పడం జరిగినది. పచ్చ దోమ, తెల్ల దోమ నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలపడం అయినది. పచ్చ పురుగుల , లద్దె పురుగు ఉధృతిని కనిపెట్టుటకు 30 రోజుల తర్వాత లింగాకర్షక బుట్టలను పొలంలో ఎకరాకి 8 చొప్పున ఏర్పాటు చేసుకోవాల్సిందిగా వెల్లడించారు. కార్యక్రమంలో రైతులు బోయ రామకృష్ణ ,బోయ రంగన్న, రేమట బాలన్న, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

## బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (17.06.2025) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలు వీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం, బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.



## సాంస్కృతిక కార్యక్రమాలు

మనగళం శ్రీశైలం దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (16.06.2025) నృత్యకళాశాల, నందికొట్కూరు వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో సిద్ధి వినాయక, శివతాండవం, అయిగిరినందిని, నాగేంద్రహారాయ శివస్తుతి, దేవీస్తుతి తదితర గీతాలకు అమృత, రామతులసి, అర్చన, వరలక్ష్మి, సహస్రశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.




## కోడుమూరు సబ్ రిజిస్టర్ ఆఫీసులో ప్రైవేటు వ్యక్తుల హాల్ చల్





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఉద్యోగుల కంటే ఎక్కువగా ప్రైవేటు వ్యక్తుల హాల్ చల్ నడుస్తోంది. ఆఫీస్ నందు వినూత్న కంపెనీకి చెందినటువంటి వ్యక్తులకు రాజ మర్యాదలు చూస్తుంటే అంత ప్రేమ సామాన్య ప్రజల మీద ఎందుకు లేదు అని ప్రశ్నిస్తున్నారు ఇంకా వారి పని చేయాలి అంటే ప్రైవేటు వ్యక్తుల ప్రాబల్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కోడుమూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వినుత్న కంపెనీ చెందినటువంటి ఆనంద్ రెడ్డి అనే వ్యక్తి మా కంపెనీకి చెందినటువంటి పొలాలు రిజిస్టర్ అయ్యేంతవరకు ఇతరులు లోపలికి రాకూడదని జనాలను లోపలికి రాకుండా అడ్డుకున్నాడు వినూత్న కంపెనీకి చెందినటువంటి ఏజెంట్ గా వ్యవహరిస్తున్నటువంటి కొత్తపల్లె దుబ్బన్న అనే వ్యక్తి పొలాల రిజిస్టర్ చేయించుకుని తక్కువ అమౌంట్ ఇవ్వడమే కాకుండా రైతులను భయభ్రాంతులను గురి చేస్తూ వారిపై విచక్షణ రహితంగా మాట్లాడుతున్నారు. కోడుమూరు సబ్ రిజిస్టర్ ఆఫీస్ గవర్నమెంట్ ఆఫీసా లేక ప్రైవేటు వ్యక్తుల సొమ్మా అని ఆశ్చర్యపోతున్నారు రైతులేమో ఎండలో చెట్ల కింద కూర్చోవాలి ప్రైవేట్ కంపెనీ చెందినటువంటి వ్యక్తులు ఆఫీసులో దర్జాగా కుర్చీలపై కూర్చొని ఉండాలని అని జనం వాపోతున్నారు. రైతుల కోసం పనిచేసే అధికారులు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఒకవైపు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల పెత్తనాన్ని వివరించేందుకు అవకతవకలు అడ్డుకునేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తున్న క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్టార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల పెత్తనంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న తీరు ఈ వ్యవహారంతో బహిర్గతం అయింది. ఇప్పటికైనా ఆఫీసు ఇబ్బంది స్పందించి అందరికీ ఒకే న్యాయం ఉండేటట్లు అందరిని ఒకే రకంగా చూస్తూ అందరికీ సమానత్వం కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# సుగాలి మెట్ట ఏపీ మోడల్ స్కూలును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- మోడల్ స్కూలులో ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు ఉద్భోధించిన కలెక్టర్
- పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరుస్తాం
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మన గం,పాణ్యం/నంద్యాల : పాణ్యం మండలం సుగాలి మట్ట ఏపీ మోడల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోడల్ పాఠశాలలోని విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటిస్తూ విద్యాభ్యాసం, పాఠశాలలోని సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. త్రాగునీటి వసతి, అప్రోచ్ రోడ్డు సమస్యగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయోగశాలలోని అన్ని పరికరాలు ఉన్నాయా లేదా సంబంధిత వివరాలపై ఆరా తీశారు. మోడల్ పాఠశాలతో పాటు చుట్టూ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలకు అవసరమైన త్రాగునీటి వసతి, సీసీ రోడ్డు తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం పదవ తరగతి గదిని పరిశీలిస్తూ విద్యార్థులతో ముచ్చటిస్తూ ఉపాధ్యాయురాలిగా మారి ఇంగ్లీష్ క్లాస్ తీసుకొని పాఠ్యాంశాలపై ఎలా ఆలోచించాలి, భవిష్యత్తులో పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి తదితర అంశాలపై విద్యార్థులకు ఉద్బోధించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ ఆహార పదార్థాలను పిల్లలకు తినిపించారు. వంటశాల, స్టోర్ రూంలో నిల్వ ఉన్న సరుకులు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహార పదార్థాలను అందించాలని సూచించారు. ఏపీ మోడల్ స్కూల్ ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్ ను, ఎంఈఓ ను కలెక్టర్ ఆదేశించారు.



# చంద్రబాబు ఏడాది పాలన చీకటి రోజులు

- రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకం
- హామీల పేరుతో 5 కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు



మన గళం,కల్లూరు రూరల్ : కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా వైఫల్యాలపై వైయస్ ఆర్‌సీపీ పాణ్యం నియోజకవర్గం మండల నాయకులు వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంగళవారం ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వైయస్ జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసమన్నారు. చంద్రబాబు ఏడాది పాలన చీకటి రోజులని, రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకాలను చేస్తున్నారని వారు విమర్శించారు. హామీల పేరుతో 5 కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం పరిధిలోని కల్లూరు, ఓర్వకల్లు,గడివేముల, పాణ్యం మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నందీశ్వరస్వామికి విశేషపూజ



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (16.06.2025) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీ సేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం మంగళవారం మరియు షష్టిని పురస్కరించుకుని ఈ రోజు (16.06.2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది.

ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# 5 -15 సంవత్సరాల వయసు దాటిన విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరి

- 5 -15 సంవత్సరాల వయసు వారు ఉచితంగా అప్డేట్ చేసుకోవచ్చు
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మన గళం,నంద్యాల కలెక్టరేట్ : ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ కు సంబంధించి 5 సం.లు, 15 సం.లు దాటిన పిల్లలు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిఎల్ఎఎంసి (జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎల్డిఓ శివారెడ్డి, జిఎస్డబ్ల్యూఎస్ సమన్వయకర్త ఖాదర్, ఆధార్ రీజినల్ కార్యాలయ సిబ్బంది దామోదర్, ఎల్డిఎం రవీంద్ర కుమార్, డిఈఓ జనార్ధన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి లీలావతి, డిఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఆధార్ ఉన్న చిన్నారులు తప్పనిసరిగా రెండు సార్లు (5సం.ల నుండి 7సం.లు, 15సం.లు నుండి 17 సం.లు మధ్యలో) ఉన్న వారు తప్పనిసరిగా ఆధార్ అప్డేట్ చేయాలన్నారు. 5 సం.లు, 15 సం.లు దాటిన చిన్నారులు ప్రతి ఒక్కరూ ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరి చేసుకోవాలన్నారు. అందుకు 5సం.లు, 15సం.ల వయస్సు వారు ఉచితంగా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పోటీ పరీక్షలు వ్రాసే అవకాశం వున్న నేపథ్యంలో తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని డిఈఓను కలెక్టర్ ఆదేశించారు. 7 సం. లు, 17 సం. లు దాటిన చిన్నారులు/విద్యార్థులు వంద రూపాయల రుసుం చెల్లించి ఆధార్ అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఆధార్ సెంటరు ఏర్పాటు చేయడానికి గాను అవసరమైన శిక్షణను ఎస్విఆర్ ఇంజనీరింగ్ లో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పోస్టల్ అధికారులను ఆదేశించారు. అప్పుడే పుట్టిన నవజాత శిశువులు ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన వెంటనే తాత్కాలిక జనన ధృవీకరణ పత్రం అందజేసేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో చంటి పిల్లలు (0-5సం.లకు) సంబంధించిన వివరాల్లో వ్యత్యాసాలు లేకుండా చూడాలని సంబధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆధార్ కేంద్రాల నిర్వహణ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంను కలెక్టర్ ఆదేశించారు.




# కోడుమూరులో టి.బి ముక్త్ భారత్ అభియాన్ పై అవగాహన మరియు ర్యాలీ.

మన గళం కోడుమూరు కోడుమూరు గ్రామపంచాయతీ నందు మంగళవారం కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న ఆధ్వర్యంలో కోడుమూరు ఉపసర్పంచ్ ఆర్. మాధులు అధ్యక్షతన క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టి.బి ముక్త్ భారత్ అభియాన్ పై అవగాహన మరియు ర్యాలీ జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీమంత్ మాదన్న మాట్లాడుతూ క్షయ వ్యాధి అని పూర్తిగా నిర్మూలించే నిమిత్తం ప్రభుత్వం టి.బి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమము టీ.బీ కేసు గుర్తింపును వేగవంతం చేయడం,మరణాలను తగ్గించడం మరియు కొత్త కేసులను నిరోధించండము కొరకు 60 సంవత్సరాలు పైబడ్డ వారికి బి.ఎం.ఐ 18 లోపు ఉన్న వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకి , ప్రోగ త్రాగే వారికి మరియు ఆల్కహాల్ తీసుకునే వారికి గల్ల పరీక్షలు మరియు ఎక్రే పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తున్నామని తెలుపుతూ రెండు వారాల నుండి దగ్గు ఉండడం, జ్వరం, బరువు మరియు ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడడం మొదలకు లక్షణాలు ఉన్న వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా గళ్ళ పరీక్ష , ఎక్రే మరియు ఆధునికమైన సిబి నాట్ మరియు ఆర్టిపిసిఆర్ లతో పరీక్ష చేయించుకుని ఒకవేళ క్షయ వ్యాధి ఉన్న వారు ప్రభుత్వం ఉచితంగా అందించే మందులు ఆశా కార్యకర్త పర్యవేక్షణలో వాడడం వల్ల క్షయ వ్యాధి పూర్తిగా నయ మవుతుందని తెలిపినారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఆర్ మాధులు మాట్లాడుతూ ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించవలనని వారు ఈ సందర్భంగా తెలియజేశారు క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ కోడుమూరు గ్రామపంచాయతీ నుండి ప్రారంభించి పాత బస్టాండ్ కోట్ల సర్కిల్ , కొత్త బస్టాండ్ వరకు రెండు వారాల మించి దగ్గు కావచ్చు టీ.బి జబ్బు దేశం గెలుస్తుంది టీ.బి ఓడి పోతుంది మన అందరి పంతం టీ.బి అంతం. టిబి గాలి ద్వారా మాత్రమే వ్యాపిస్తుంది. అను నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ కే .కమాల్ సాహెబ్ ఉమాబాయి సీనియర్ టీ.బి సూపర్వైజర్ వెంకటేశ్వర్లు కోడుమూరు ఒకటో సచివాలయ సిబ్బంది,ఆశా కార్యకర్తలు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలి

## -వైసీపీ వై.సీ.పీ శ్రీశైలం మండల అధ్యక్షుడు వట్టి వెంకటరెడ్డి

మనగళం : 2024 ఎన్నికల వేళలో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలని వై.సీ.పీ శ్రీశైలం మండల అధ్యక్షుడు వట్టి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వై.సీ.పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అరాచక పాలనను కొనసాగిస్తుందన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. సున్నిపెంటను గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలన్నారు



# ఆ టాటా కారు ఈవీ వెర్షన్ రిలీజ్.. టాప్ రేపుతున్న నయా ఫీచర్లు

మన గళం భారతదేశంలోని కారు లవర్స్ ఇటీవల ఈవీ కార్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. మైలేజ్ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తూ అన్ని కంపెనీలు లాంగ్ రేంజ్ ఈవీలను లాంచ్ చేయడంతో కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. తాజాగా ప్రముఖ కంపెనీ టాటా తన సియెర్రాను ఈవీ వెర్షన్‌ను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. టాటా మోటార్స్ సియెర్రా ఎస్‌యూవీను ఐసీఈ, ఈవీ వేరియంట్లలో రీ లాంచ్ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ట్రై-స్క్రీన్ సెటప్, అధునాతన ఫీచర్లు, లెవెల్ 2 ఏడీఏఎస్ వంటి అత్యాధునిక భద్రతా సాంకేతికతలతో ఈ కారును లాంచ్ చేయనున్నారు. హారియర్ ఈవీతో మార్కెట్‌ను షేక్ చేస్తున్న టాటా మోటార్స్ ఈ సంవత్సరం సియెర్రాతో మరో ఊపు తీసుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మోడల్‌ను ముందుగా 2025 భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రదర్శించారు. ఇప్పటికే ఈ ఎస్‌యూవీకు సంబంధించిన స్పై షాట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత టాటా సియెర్రా తిరిగి మార్కెట్లోకి వచ్చి ఈ రంగంలో మరోసారి ఆధిపత్యం చెలాయిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే సియెర్రా ఎస్‌యూవీ ఐసీఈ, ఈవీ వేరియంట్లు రెండూ కొనుగోలుకు అందుబాటులో ఉండున్నాయి. టాటా సియెర్రా డ్రైవింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి ట్రై-స్క్రీన్ సెటప్‌తో ఆకట్టుకోనుంది. ఇటీవల వెల్లడైన నివేదికల ప్రకారం ప్రతి యూనిట్ 12.3 అంగుళాలు స్క్రీన్‌తో వస్తుంది. ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌కు సంబంధించిన సెంటర్ యూనిట్, డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ ఒక స్క్రీన్‌పై ఉంటాయి. కొన్ని నెలల క్రితం భారతదేశంలో ప్రారంభించిన మహీంద్రా ఎక్స్‌ఈవీ 9ఈ ప్రేరణతో ఈ కారులో కొన్ని మార్పులు చేశారని పుకార్లు షికారు చేస్తున్నాయి. పనోరమిక్ సన్‌రూఫ్, హర్మాన్ సౌండ్ సిస్టమ్, డ్యూయల్-టోన్ డ్యాష్‌బోర్డ్, స్టైలిష్ ఫోర్-స్పోక్ మల్టీఫంక్షనల్ స్టీరింగ్ వీల్, వైర్‌లెస్ ఛార్జింగ్, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, డాష్‌బోర్డ్‌పై సాఫ్ట్-టచ్ మెటీరియల్స్, ఆటోమేటిక్ అడ్జస్టబుల్ వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు ఉంటాయి. టాటా సియెర్రా ఇటీవల విడుదల చేసిన హారియర్ ఈవీలో వచ్చినట్లుగానే అనేక ప్రసిద్ధ భద్రతా ఫీచర్స్‌తో వస్తుంది. సరౌండ్-వ్యూ కెమెరా, 2 ఏడీఏఎస్, హెచ్‌డీ రియర్‌వ్యూ మిర్రర్, ప్రామాణికంగా ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, ఇతర ప్రయోజనాలతో వస్తాయి. ఐసీఈ వెర్షన్ 2.0 లీటర్ల డీజిల్ ఇంజన్, 1.5 లీటర్ల టర్బోచార్జ్ జీడీఐ పెట్రోల్ ఇంజన్‌ను కలిగి ఉండే అవకాశం ఉంది. ఈ ఇంజన్ ఎంపికలతో మాన్యువల్, ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లు రెండూ అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఎలక్ట్రిక్ వెర్షన్ హారియర్ ఈవీ మాదిరి బ్యాటరీ ప్యాక్, డ్యూయల్-మోటార్ ఏడబ్ల్యూడీ సిస్టమ్‌ను ఉపయోగించే అవకాశం ఉంది.

# ఈ కూరగాయను తక్కువ అంచనా వేయకండి..

మన గళం రోజువారీ ఆహారంలో మనం ఎన్నో కూరగాయలు వాడుతాం. కానీ కొన్ని సార్లు వంకాయను తినం.. ఎందుకంటే దాని రుచి నచ్చదని అంటాం. కానీ మనం దీన్ని పూర్తిగా తినకపోవడం ఆరోగ్యానికి ఉపయోగపడే గొప్ప ఔషధాన్ని దూరం చేసుకున్నట్లే అవుతుంది. వంకాయలో ఫైటోన్యూట్రియంట్స్ అనే రసాయనాలు మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇవి మెదడులోని నర కణాల మధ్య సంబంధాన్ని బలోపేతం చేస్తాయి. దాని వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. మతిమరుపు తగ్గుతుంది. ఇందులో ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉండటం వల్ల రోజూ తింటే ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వయస్సు పెరిగే కొద్దీ ఎముకల బలం తగ్గకుండా ఉండాలంటే వంకాయ మంచి సహాయం చేస్తుంది. వంకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, మాంగనీస్ శరీరంలోని కణాలను రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కాపాడి.. క్యాన్సర్ కణాలు పెరగకుండా నియంత్రిస్తాయి. వంకాయలో ఐరన్ ఉండటం వల్ల రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిని పెంచే అవకాశం ఉంటుంది. దీన్ని తరచుగా ఆహారంలో చేర్చడం ద్వారా రక్తహీనత (ఎనిమియా) సమస్యలను తగ్గించవచ్చు. నీరసంగా, అలసటతో ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకరం. డయాబెటిస్ ఉన్నవారు కూడా వంకాయ తినవచ్చు. ఇందులో ఉండే పాలిఫినాల్స్ రక్తంలో గ్లూకోజ్ శాతం తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇది తోడ్పడుతుంది. వంకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది.



ఫలితంగా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఆయుర్వేద నిపుణుల మాటల ప్రకారం.. వంకాయ నిద్రలేమి లాంటి సమస్యలకు సహజ చికిత్సగా ఉపయోగపడుతుంది. ఇది శరీరంలోని అధిక వేడిని తగ్గించి, తల నొప్పి, మలబద్ధకం, గొంతులో గరగర, వాంతులు, శరీరంలో వాపులు, వాత రోగాలకు ఉపశమనం ఇస్తుంది. మొదటి దశలో ఉన్న కిడ్నీ రాళ్లను కరిగించే గుణం కూడా దీనిలో ఉంది. ఈ కూరగాయను మీరు ఇష్టపడకపోయినా.. దీని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం విస్మరించలేనివి. రోజూ వంకాయను తక్కువ మోతాదులో ఆహారంలో చేర్చడం ద్వారా మన ఆరోగ్యాన్ని చాలా మెరుగుపరుచుకోవచ్చు.

# ఈ సీడ్స్ తింటున్నారా..? జర జాగ్రత్త.. వీటితో సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయి..!

మన గళం బూడిదగుమ్మడి విత్తనాల్లో ఎక్కువ ఫైబర్ ఉంటుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే కొంతమందికి జీర్ణ సమస్యలు వస్తాయి. తక్కువ మోతాదులో తీసుకుంటే ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. కానీ ఎక్కువ తింటే కడుపు నొప్పి, గ్యాస్ సమస్యలు, మలబద్ధకం, డయేరియా లాంటివి రావచ్చు. ఈ విత్తనాల్లో మంచి కొవ్వులు ఉన్నా వాటిలో కేలరీలు ఎక్కువగానే ఉంటాయి. ప్రతి రోజు ఎక్కువ మోతాదులో తీసుకుంటే బరువు పెరిగే అవకాశాలు ఉంటాయి. బరువు అదుపులో ఉంచుకోవాలంటే వీటిని తక్కువగా మాత్రమే తీసుకోవాలి. తిన్న తర్వాత వ్యాయామం చేయడం తప్పనిసరి. కొంతమందికి విత్తనాలు, నట్‌లు లాంటి వాటికి సహజంగానే అలర్జీ ఉంటుంది. అలాంటి వారు బూడిదగుమ్మడి విత్తనాలు తీసుకున్నప్పుడు గొంతు దురద, తలనొప్పి, తుమ్ములు, దగ్గు, చర్మంపై దద్దుర్లు లాంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాంటి వారు తినే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. బూడిదగుమ్మడి విత్తనాల్లో మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. అందుకే హై బీపీ ఉన్నవారికి ఇవి మంచివి. కానీ లో బీపీ ఉన్నవారు వీటిని ఎక్కువగా తీసుకుంటే రక్తపోటు మరింతగా తగ్గే ప్రమాదం ఉంది. కాబట్టి అలాంటి వారు తీసుకునే మోతాదుపై జాగ్రత్తగా ఉండాలి. చిన్నపిల్లల జీర్ణ వ్యవస్థ బలహీనంగా ఉంటుంది. అందుకే ఎక్కువ పీచు పదార్థాలు వారికి కడుపు నొప్పి, అజీర్ణం లాంటి సమస్యలు కలిగించవచ్చు. అలాగే విత్తనాలు గొంతులో ఇరుక్కునే అవకాశం కూడా ఉంది. కాబట్టి వీటిని నేరుగా ఇవ్వకూడదు. వాటిని పొడి చేసి పాలల్లో కలిపి ఇవ్వవచ్చు. ఈ



విత్తనాలను వేయించి పొడి రూపంలో తీసుకోవడం మంచిది. రోజుకు ఒక స్పూన్ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. చిన్నపిల్లలకు అర స్పూన్ కంటే ఎక్కువ ఇవ్వకూడదు. వీటిని పెరుగు లాంటి ఆహారాల్లో కలిపి తీసుకుంటే మేలు. బూడిదగుమ్మడి విత్తనాల్లో చాలా పోషకాలు ఉన్నా.. వాటిని ఎక్కువగా తీసుకుంటే పైన చెప్పిన లక్షణాలు వస్తాయి. పూర్తిగా మానేయడం కంటే తక్కువ మోతాదులో జాగ్రత్తగా తీసుకోవడమే మంచిది. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే మితంగా తినడమే ముఖ్యం.

# పిల్లలకు చిన్నప్పటి నుంచే ఈ అలవాట్లు నేర్పితే..

మన గళం పిల్లలతో తరచుగా మాట్లాడటం వల్ల వారిలో నమ్మకం పెరుగుతుంది. వారు ఏ సమస్యతో బాధపడుతున్నా మీతో పంచుకోగలగాలి. ఎలాంటి విమర్శలు లేకుండా వారి మాటలు వినడం, తమ మనసులోని భావాలు చెప్పడానికి అవకాశం ఇవ్వడం



వారి మానసిక ధైర్యాన్ని పెంచుతుంది. చిన్న వయసులోనే ఈ అలవాటు వారిని జీవితాంతం ధైర్యంగా ఉంచుతుంది. పిల్లలకు రోజూ కొన్ని నిమిషాలు ధ్యానం, శ్వాస పద్ధతులు నేర్పడం వల్ల వారు తమ మనసును అదుపు చేసుకోవడం, ఒత్తిడిని ఎదుర్కోవడం నేర్చుకుంటారు. ఇవి పరీక్షల సమయంలో మానసిక స్థైర్యాన్ని ఇస్తాయి. అలాగే వారి దృష్టి శక్తి మెరుగుపడటానికి.. చదువుపై ఏకాగ్రత పెరగడానికి చాలా ఉపయోగపడతాయి. పిల్లలు ఇతరుల భావాలను అర్థం చేసుకోగలగాలి. ఒకరిపై దయ చూపడం, తప్పులు ఒప్పుకోవడం, బాధను అర్థం చేసుకోవడం లాంటి లక్షణాలు వారికి చిన్నప్పుడే అలవాటు చేయాలి. ఇవి వారి భావోద్వేగ తెలివితేటలను మెరుగుపరుస్తాయి. తమను తాము విశ్లేషించుకునే అలవాటు వారికి మంచి బంధాలను ఏర్పరచుకోవడానికి సహాయపడుతుంది. ఈ రోజుల్లో పిల్లలు డిజిటల్ ప్రపంచానికి చాలా దగ్గరగా ఉంటున్నారు. అయితే దీన్ని సరైన విధంగా ఉపయోగించుకుంటే వారికి ప్రయోజనం కలుగుతుంది. వారికి మొబైల్, ల్యాప్ టాప్ వాడే నియమాలు నేర్పాలి. చదువు, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం లాంటి మంచి పనులకే టెక్నాలజీ వాడేలా ప్రోత్సహించాలి. స్క్రీన్ టైమ్ కు ఒక పరిమితి పెట్టడం చాలా అవసరం. ప్రతి పిల్లవాడిలో ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుంది. అది పాటలు పాడటం కావొచ్చు, బొమ్మలు వేయడం కావొచ్చు, ఆటలు కావొచ్చు. పిల్లల ఆసక్తి ఏదైతే ఉందో అందులో నైపుణ్యం పెరిగేలా వారిని ప్రోత్సహించాలి. అవసరమైతే ప్రొఫెషనల్ క్లాసుల్లో చేర్పించి వారిని మరింత మెరుగుపరచాలి. ఇది పిల్లలలో స్వయంప్రేరణను పెంచడమే కాకుండా.. జీవితంలో ముందుకు వెళ్లడానికి ధైర్యాన్ని ఇస్తుంది. పిల్లలు బలంగా, సురక్షితంగా, విజయవంతంగా ఎదగాలంటే ఈ అంశాలు చాలా ముఖ్యం. తల్లిదండ్రులుగా మనం సరైన మార్గం చూపిస్తే పిల్లలు భవిష్యత్తులో ఏ ఒత్తిడినైనా అధిగమించి గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రేమ, సహనం, సరైన మార్గదర్శకత్వంతో వారి ప్రయాణానికి బలంగా నిలబడండి.



# ఇలా చేస్తే మీ ఇంట్లో బల్లులు పరార్..

మన గళం వేసవి కాలంలో చిన్న కీటకాల భయం చాలా పెరుగుతుంది. ముఖ్యంగా ఇంటి లోపల వీటి బెడద చాలా ఉంటుంది. ఇది ఒక్క కాలంలోనే కాదు అన్ని కాలాల్లో ప్రతి ఇంట్లో పెద్ద సమస్యగా మారుతున్నాయి. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ బల్లుల సమస్య తీరడం లేదు. అవి మురికిగా కనిపించడమే కాకుండా, పరిశుభ్రతకు సంబంధించిన ప్రమాదాలను కూడా పెంచుతాయి. అదే సమయంలో చాలా మంది బల్లులకు భయపడతారు. వారు వాటిని తరిమికొట్టడానికి అన్ని రకాల ఖరీదైన స్ప్రేలు, పురుగుమందుల కోసం వెతకడం ప్రారంభిస్తారు. అయితే, మీరు దీని కోసం కొన్ని సహజ పద్ధతులను కూడా ప్రయత్నించవచ్చు. అలాంటి ఒక పద్ధతి ఇంటర్నెట్‌లో చాలా వైరల్ అవుతోంది. దాని గురించి తెలుసుకుందాం.

ఈ వైరల్ వీడియో ఏమిటి?

బల్లులను వదిలించుకునే ఈ పద్ధతిని 'చందా మరియు ఫ్యామిలీ వ్లాగ్స్' అనే ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో షేర్ చేశారు. దీని కోసం మీకు కేవలం 3 అంశాలు మాత్రమే అవసరం. వీటిని పాటిస్తే బల్లులు ఉండవంటున్నారు. ముందుగా కాటన్ తో చిన్న బంతులను తయారు చేయండి. ఈ బంతులను ఉల్లిపాయ రసంలో ముంచి, ఆపై వాటిని సేఫ్టీ పిన్‌పై దారం వేయండి. ఇప్పుడు మీరు పిన్‌లను బల్లులు ఎక్కువగా వచ్చే ప్రదేశాలలో ఉంచాలి. ఉదాహరణకు మీరు వంటగది మూలలో ఒక చిన్న మేకును ఉంచి పిన్‌ను వేలాడదీయవచ్చు. సేఫ్టీ పిన్‌ను అల్మారా దగ్గర ఉంచండి. మీరు ఈ పిన్‌లను కిటికీ గుమ్మము మీద లేదా తలుపు పైన కూడా వేలాడదీయవచ్చు.

బల్లులు ఎలా పోతాయి?

బల్లులు ఉల్లిపాయల ఘాటైన వాసనను అస్సలు ఇష్టపడవు. ఈ వాసన తాకిన వెంటనే, అవి అక్కడి నుండి పారిపోతాయి. ఈ నివారణ ఎలాంటి హానికరం కాదు.. అలాగే విషపూరితం కాదు. ఉల్లిపాయలలో ఉండే సల్ఫర్, బలమైన వాసన కారణంగా బల్లులు ఇంటి నుండి బయటకు పారిపోతాయి. మీరు కూడా బల్లులతో ఇబ్బంది పడుతుంటే ఖచ్చితంగా ఈ ఉల్లిపాయ నివారణను ప్రయత్నించండి

# తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు..

మన గళం మహిళలు ఎక్కువగా ఇష్టపడేదాంట్లో ఏదైనా ఉన్నదా అంటే అది బంగారమే. మగువల మనసు దోచడంలో బంగారం ముందు స్థానంలో ఉంటుంది. అంతే కాకుండా చిన్న ఫంక్షన్స్ నుంచి పెద్ద పెద్ద శుభకార్యాల వరకు ఏ వేడుక జరిగినా మహిళలు ఒంటి నిండా బంగారం ధరించడానికికే ఎక్కువ ఆసక్తిచూపుతుంటారు.



అంతే కాకుండా ఇంట్లో పెళ్లి జరుగుతుందంటే బంగారం కొనుగోలు చేయడంపైనే ఎక్కువ ఇంట్రెస్ట్ చూపుతారు. ఇంకొంత మంది అయితే బంగారం కొనుగోలు చేసి ఇంట్లో పెట్టుకుంటారు. కానీ ఇప్పుడు బంగార కొనుగోలు చేయాలంటే చుక్కలు చూడాల్సిన పరిస్థితులు ఎదురు అవుతున్నాయి. ఎందుకంటే ? రోజు రోజుకు పసిడి ధరలు పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. నేడు బంగారం ప్రియులకు గుడ్ న్యూస్ అనే చెప్పాలి. ఎందుకంటే పసిడి ధర కాస్త తగ్గింది.జూన్ 17, 2025న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,500 గా ఉండగా,22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.93,040గా ఉంది. జూన్ 16 2025 సోమవారం (నిన్న)24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.101,510గా ఉండగా,నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.101,500గా ఉంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్న రూ.93,050గా ఉండగా, నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.93,040గా ఉంది. ప్రముఖ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.101,500 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.93,050 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,19,800లుగా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.101,500 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.93,050లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,19,800 లుగా ఉంది. వరంగల్ జిల్లాలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.101,500, 22 క్యారెట్ల ధర రూ.93,050 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,19,800లుగా ఉంది.

# కర్నాటకలో బైక్ ట్యాక్సీ సేవలు రద్దు

మన గళం : కర్నాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఆ రాష్ట్రంలో బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం నుంచి ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థలు తమ సేవలను నిలిపివేశాయి. హైకోర్టు ఆదేశాలతో తమ సేవలను నిలిపివేస్తున్నట్టు ర్యాపిడో వెల్లడించింది. సేవలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామని పేర్కొంది. బైక్ ట్యాక్సీ సేవలను ఉబర్ మోటో కొరియర్ కింద మార్చింది. మరో అగ్రిగేటర్ ఓలా తన యాప్‌లో బైక్ ట్యాక్సీ ఆప్షన్‌ను తొలగించింది. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో ఈ సేవలను నిలిపివేయాలంటే కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశంపై క్యాబ్ సర్వీసు సంస్థలు సవాలు చేయడంతో డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ ఆదేశాలను సమర్థించింది. జూన్ 20లోగా దీనిపై తమ స్పందన తెలపాలని కర్నాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 24కు వాయిదా వేయగా.. తాత్కాలికంగా బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. దీంతో గిగా వర్కర్లు తమ ఉపాధిని కోల్పోయారు.

# ఖాతాదారులకు షాక్ ఇచ్చిన ఎస్‌బీఐ..

మన గళం దేశంలో ఎక్కువ సంఖ్యలో పెట్టుబడిదారులు తమ సొమ్మును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే వివిధ పథకాల్లో పెట్టుబడి పెడుతూ ఉంటారు. పోస్టాఫీసు తర్వాత గ్రామీణులు ఎస్‌బీఐ అంటే నమ్మకంతో ఉంటారు. ఎస్‌బీఐ కూడా ఎప్పటికప్పుడు ఖాతాదారులకు తన సేవలను విస్తరిస్తూ ఉంటుంది. అయితే ఇటీవల ఎస్‌బీఐ వడ్డీ రేట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన డిపాజిటర్లకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. జూన్ 15 నుంచి ఎస్‌బీఐ వివిధ కాలపరిమితులలో రూ.3 కోట్ల వరకు రిటైల్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అలాగే సేవింగ్స్ ఖాతా రేటును ఆల్-టైమ్ కనిష్ట స్థాయి 2.5 శాతానికి తగ్గించింది. ఈ తగ్గింపులు కొత్త, పునరుద్ధరణ డిపాజిట్లను ప్రభావితం చేస్తాయి. ఈ నెల ప్రారంభంలో ఆర్‌బీఐ రెపో రేటులో 50 బేసిస్ పాయింట్ల తగ్గించడంతో ఎస్‌బీఐ ఈ మేరకు చర్యలు తీసుకుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బ్యాంకు లాభాల మార్జిన్లను కాపాడటం ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేస్తున్నారు. ఎస్‌బీఐకు సంబంధించిన రూ.36 లక్షల కోట్ల రుణ పోర్ట్‌ఫోలియోలో దాదాపు 45 శాతం రెపో రేటుతో ముడిపడి ఉంది. వీటిలో రూ.8.3 లక్షల కోట్ల గృహ రుణాలు, రూ.1.2 లక్షల కోట్ల వాహన రుణాలు ఉన్నాయి. తత్ఫలితంగా కొత్త కస్టమర్లకు బ్యాంకునకు సంబంధించిన అగ్ర గృహ రుణ రేట్లు ఇప్పుడు 7.5 శాతంగా ఉన్నాయి. బెంచ్‌మార్క్ రేటు తగ్గింపు వల్ల బ్యాంకు వార్షిక వడ్డీ ఆదాయం దాదాపు రూ.8,100 కోట్లు తగ్గుతుందని అంచనా. ఈ




ప్రభావాన్ని తగ్గించడానికి పొదుపు డిపాజిట్ రేట్లను తగ్గించడం వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పొదుపు ఖాతాల్లో రూ.23 లక్షల కోట్లు ఉండటంతో తక్కువ వడ్డీ చెల్లింపు వల్ల బ్యాంకుకు ఏటా దాదాపు రూ.5,750 కోట్లు ఆదా అవుతుందని భావిస్తున్నారు. ఈ తరహా సర్దుబాట్లు ఎస్‌బీఐ మాత్రమే చేయడం లేదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా అధిక విలువ కలిగిన డిపాజిట్లపై తన పొదుపు ఖాతా రేటును అన్ని నిల్వలపై 2.75 శాతానికి తగ్గించిందని నిపుణులు వివరిస్తున్నారు. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లను 25 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది.

# మరింత వేగంగా యూపీఐ చెల్లింపులు..

మన గళం : భారతదేశంలో డిజిటల్ పేమెంట్లు రోజురోజుకూ వృద్ధి చెందుతున్నాయి. 2016లో నోట్ల రద్దు సమయంలో అందుబాటులోకి తీసుకొచ్చిన యూపీఐ చెల్లింపులు తక్కువ సమయంలో ప్రజాదరణ పొందాయి. ముఖ్యంగా దేశంలో చిల్లర సమస్యకు యూపీఐ చెల్లింపులతో చెక్ పడింది. తాజాగా యూపీఐ చెల్లింపులు మరింత వేగంగా సాగుతున్నాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. యూపీఐ చెల్లింపు జూన్ 16న మరింత వేగంగా సాగాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త ఆదేశాలతో వేగవంతమైన చెల్లింపులు సాధ్యమయ్యాయని చెబుతునారు. బ్యాంకులు, చెల్లింపు యాప్‌లతో సహా అన్ని యూపీఐ యాప్‌లు యూపీఐ ఆధారిత ఆర్థిక, ఆర్థికేతర సేవలకు గరిష్ట ప్రతిస్పందన సమయాన్ని తగ్గించాలని ఆదేశించింది. ఈ కొత్త నిబంధనల నేపథ్యంలో యూపీఐ లావాదేవీని పూర్తి చేయడానికి పట్టే సమయం అంటే డబ్బు పంపడం లేదా స్వీకరించడమైన 15 సెకన్లకు పరిమితం అయ్యింది. గతంలో యూపీఐ చెల్లింపులకు గరిష్ట సమయం 30 సెకన్లుగా ఉంటే ఎన్‌పీసీఐ దాన్ని 15 సెకన్లకు తగ్గించింది. ఈ తగ్గింపు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి అన్ని యూపీఐ ప్లాట్‌ఫారమ్‌లతో సహా యోనో ఎస్‌బీఐ, ఐమొబైల్ పే, ఇతర బ్యాంకింగ్ యాప్‌లకు వర్తిస్తుంది. సాధారణంగా ఓ వ్యక్తి క్యూఆర్ కోసం స్కాన్ చేశాక సంబంధిత బ్యాంక్ ఎన్‌పీసీఐ సిస్టమ్ ద్వారా మరో బ్యాంకునకు "చెల్లింపు" అభ్యర్థనను పంపుతుంది. ఆ బ్యాంకు ఖాతా యాక్టివ్‌గా ఉందా? లేదా వివరాలు సరిగ్గా ఉన్నాయా? వంటి విషయాలను తనిఖీ చేసి డబ్బు అందినట్లు నిర్ధారణను తిరిగి పంపుతుంది. ఈ నిర్ధారణ ఎన్‌పీసీఐ సిస్టమ్ ద్వారా సంబంధిత బ్యాంక్‌కు తిరిగి వెళుతుంది. దాంతో మన మొబైల్‌లో ట్రాన్స్‌యాక్షన్ సక్సెస్‌ఫుల్ అని వస్తుంది. ఇప్పటి వరకు ఈ మొత్తం ప్రక్రియకు 30 సెకన్లు పట్టేది. కానీ జూన్ 16, 2025 నుంచి దీనికి కేవలం 15 సెకన్లు మాత్రమే పడుతుంది. కేవలం చెల్లింపులు




మాత్రమే కాకుండా లావాదేవీ స్థితిని తనిఖీ చేయడం లేదా విఫలమైన చెల్లింపులను తిరిగి పొందడం వంటి కార్యకలాపాలు ఇప్పుడు 30 సెకన్లకు బదులుగా కేవలం 10 సెకన్లు మాత్రమే పడుతుంది. కాబట్టి లావాదేవీ విషయంలో తప్పు జరిగితే మీరు ఆ లావాదేవికి సంబంధించిన అప్‌డేట్ పొందడానికి లేదా దానిని తిరిగి పొందడానికి ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం ఉండదు.



## విజయ్ సేతుపతి జోడిగా ఆ క్రేజీ బ్యూటీ..

మన గళం దక్షిణాది చిత్రపరిశ్రమలోని అగ్ర హీరోలలో విజయ్ సేతుపతి ఒకరు. ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా సినీరంగంలోకి అడుగుపెట్టి మొదట్లో చిన్న చిన్న పాత్రలు పోషించారు. హీరోయిజం, మాస్ యాక్షన్ ఉండే చిత్రాలు కాకుండా కంటెంట్ ప్రధానంగా ఉండే విభిన్నమైన సినిమాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. విజయ్ సేతుపతి సినిమాలకు బాక్సాఫీస్ వద్ద స్పెషల్ క్రేజ్ ఉంటుంది. ఇప్పటివరకు వరుస హిట్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఈహీరో.. అటు విలన్ పాత్రలతోనూ ఇరగదీస్తున్నాడు. ఇప్పటికే ఉప్పెన సినిమాలో రాయనం పాత్రతో తెలుగువారికి దగ్గరయ్యారు. ఇక షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ సినిమాతో నార్త్ లోనూ ఫేమస్ అయ్యారు. ఇక ఇప్పుడు డేరింగ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్ చేయనున్నారు. ఇదివరకు ఈ మూవీ గురించి అఫీషియల్ ప్రకటన వచ్చింది. దీంతో నిత్యం ఈ మూవీ గురించి ఏదోక న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ టబు కీలకపాత్రలో కనిపించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆ తర్వాత విజయ్ సేతుపతి జోడిగా చాలా మంది హీరోయిన్స్ పేర్లు తెరపైకి వచ్చాయి. బాలీవుడ్ బ్యూటీ రాధిక ఆప్టే నుంచి టాలీవుడ్ హీరోయిన్ నివేదా థామస్ వరకు ప్రతి ఒక్కరి పేర్లు వినిపించాయి. తాజాగా ఈ మూవీలో కనిపించే హీరోయిన్ గురించి అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ సినిమాలో కేరళ కుట్టి సంయుక్త మీనన్ జాయిన్ అయినట్లు తెలుపుతూ ట్విట్టర్ ఖాతాలో ఆ బ్యూటీ ఫోటో షేర్ చేశారు. "ఆమె నడకలో హుందాతనం%ౌ% కళ్లల్లో ఆగ్రహం" అంటూ సంయుక్తకు స్వాగతం పలికారు. ఈ సినిమాకు బెగ్గర్ అనే టైటిల్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలాగే భిక్షాందేహి అనే టైటిల్ పేరు సైతం వినిపిస్తుంది. కానీ వీటిపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. దీనిపై అధికారిక ప్రకటన కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. కొన్నాళ్లుగా సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తున్నారు పూరి జగన్నాథ్. లైగర్, డబుల్ ఇస్మార్ట్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయాయి. దీంతో హిట్ అందుకోవడమే లక్ష్యంగా ఇప్పుడు విజయ్ సేతుపతితో చేయబోయే ప్రాజెక్ట్ పై మరింత ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం నిఖిల్ సిద్ధార్థ్ సరసన స్వయంభు చిత్రంలో నటిస్తుంది సంయుక్త.

## ప్యారడైజ్ లక్ష్యానికి అనుకోని బ్రేకులు





మన గళం న్యాచురల్ స్టార్ నాని కెరీర్ లోనే అతి పెద్ద ప్యాన్ ఇండియా మూవీగా రూపొందుతున్న ది ప్యారడైజ్ ముందు లాక్ చేసుకున్న విడుదల తేదీ మార్చ్ 26. ఒక రోజు గ్యాప్ తో రామ్ చరణ్ పెద్ది వస్తున్నా సరే వెనక్కు తగ్గకూడదని తొలుత నిర్ణయించుకున్నారు. కానీ తాజా పరిణామాలు ప్యారడైజ్ కు బ్రేక్స్ లా మారుతున్నాయని ఇన్ సైడ్ టాక్. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ జరిగినప్పటికీ ఇంకొందరు కీలక ఆర్టిస్టుల డేట్లు అందుబాటులో లేకపోవడంతో పాటు సెట్ వర్క్ మరింత మెరుగు పరచాలనే ఉద్దేశంతో చిన్నవిరామం ఇచ్చారని, తిరిగి జూలై లేదా ఆగస్ట్ లో పునఃప్రారంభమవుతుందని అంతర్గత సమాచారం.ఒకవేళ ఇది నిజమైతే ప్యారడైజ్ మార్చ్ లో రావడం కష్టం. వేసవికి వెళ్లిపోవాల్సి ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల వేగంగా తీయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ పరిస్థితులు దానికి సహకరించడం లేదని వినికిడి. నాని కూడా ఎలాంటి కమిట్ మెంట్స్ లేకుండా పూర్తిగా దీనికే అంకితమవుతున్నాడు. బయట ప్రచారం జరుగుతున్నట్టు ఇంకా ఓటిటి డీల్ కాలేదని తెలిసింది. నెట్ ఫ్లిక్స్ రెడీగా ఉన్నా రేట్ విషయంలో కంక్లూజన్ కు రాలేదని అంటున్నారు. చాలా ముఖ్యమైన పాత్రకు మోహన్ బాబుని తీసుకున్నారనే వార్త కూడా అధికారిక ధృవీకరణ దక్కించుకోలేదు. నెలల తరబడి ఇది గాసిప్ గానే ఫిలిం నగర్ వర్గాల్లో తిరుగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే భారీ పొటెన్షియల్ ఉన్న పెద్ది, ది ప్యారడైజ్ లు క్లాష్ లేకుండా సోలోగా రావడమే మంచిది. ఒకపక్క పెద్దిని దర్శకుడు బుచ్చిబాబు పరుగులు పెట్టిస్తున్నారు. ఇంకా చాలా టైం ఉన్నప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్, ప్రమోషన్లకు ఎక్కువ సమయం దొరికేలా చూసుకుంటున్నారు. హైప్ పరంగా చూస్తే దీని మీద విపరీతమైన బజ్ వచ్చేసింది.

## ఈ సినిమాకు వెబ్ సిరీస్ ఎందుకు?



మన గళం : ఎంత పెద్ద బడ్జెట్ తో తీసినా ఎంత క్రేజీ క్యాస్టింగ్ ఉన్నా కంటెంట్ బాలేకపోతే ప్రేక్షకులు నిర్మొహమాటంగా మొదటి షోకే తిరస్కరించే రోజులివి. తెరవెనుక 24 క్రాఫ్ట్స్ ఎంత కష్టపడ్డారనేది ఆడియన్స్ కి అనవసరం. తన టికెట్ డబ్బుకు, సమయానికి న్యాయం చేశారా లేదా అనేది మాత్రమే చూసుకుంటాడు. ఉద్దేశపూర్వకంగా ఏదైనా సినిమాని చంపడం సోషల్ మీడియా జమానాలో అయ్యే పని కాదు. కానీ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మాత్రం ఈ వాస్తవాన్ని అంగీకరించేందుకు ఇష్టపడటం లేదు. సూర్యతో తీసిన రెట్రో మంచి చిత్రమని, థియేటర్లకు వెళ్ళినప్పుడు ఆడియన్స్ తనకు చెప్పారని మళ్ళీ అదే క్యాసెట్ వినిపిస్తున్నారు.రెట్రోని 40 నుంచి 50 నిమిషాల వరకు ఒక్కో ఎపిసోడ్ కి నిడివి పెట్టి వెబ్ సిరీస్ లా రిలీజ్ చేసే ఆలోచన ఉందని, కానీ నెట్ ఫ్లిక్స్ నుంచి అంత సానుకూల స్పందన రాలేదని చెప్పుకొచ్చారు. కొందరు ఉద్దేశపూర్వకంగా డబ్బులు ఖర్చు పెట్టి సినిమాలను నెగటివ్ చేస్తున్నారని, అలాంటి వాళ్లకు రెట్రో బలైపోయిందని అన్నారు. అసలు ఎవరి ప్రభావం లేని సామాన్య ప్రేక్షకులు, అభిమానులకు సైతం రెట్రో నచ్చలేదు. కలెక్షన్లలోనూ అది బయట పడింది. నిజంగా కథలో దమ్ముంటే ఎవరూ ఎవరిని ఆపలేరని చాలా సినిమాలు ఋజువు చేశాయి. కానీ కార్తీక్ సుబ్బరాజ్ ఇవన్నీ ఒప్పుకోవడానికి ససేమిరా అంటున్నారు. ఇప్పుడు చేసిన పొరపాట్లు ఏవో గుర్తిస్తే భవిష్యత్తు అవి రిపీట్ కాకుండా చూసుకోవచ్చు. అలా కాకుండా నేనో క్లాసిక్ తీశాను, కావాలని చంపేశారు అంటే ఎవరూ సానుభూతి చూపరు. కంగువ టైంలోనూ సూర్య భార్య జ్యోతిక ఇదే తరహాలో బాగున్న సినిమాని కిల్ చేశారని, ఎంత కష్టపడి తీశారో మీకు తెలుసా అంటూ సీరియస్ గానే నిలదీశారు.

## 'కృష్ణ' విలన్ ఎలా చనిపోయాడంటే..?



మన గళం ముకుల్ దేవ్.. అటు హిందీలో, ఇటు తెలుగులో బాగా పాపులర్ అయిన విలన్. తెలుగులో పదుల సంఖ్యలో సినిమాలు చేసిన రాహుల్ దేవ్ తమ్ముడే ఈ ముకుల్ దేవ్. అన్న వారసత్వాన్ని కొనసాగిస్తూ నటుడిగా మంచి గుర్తింపే సంపాదించాడు. తెలుగులో 'కృష్ణ'తో పాటు అదుర్స్, సిద్ధం, నిప్పు, భాయ్ లాంటి చిత్రాల్లో నటించిన ముకుల్.. తర్వాత కనిపించకుండా పోయాడు. ఇటీవలే అతడి మరణవార్త విని అందరూ షాకయ్యారు. ముకుల్ అనారోగ్యంతో చనిపోయాడన్నారు కానీ.. అతడికి ఏమైందన్నది వెల్లడి కాలేదు. ఐతే తన తమ్ముడి మరణం గురించి బాలీవుడ్లో రకరకాల ఊహాగానాలు చెలరేగుతున్న నేపథ్యంలో రాహుల్ దేవ్ ఒక ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చాడు. తల్లిదండ్రుల మరణం, భార్యతో విడాకుల నేపథ్యంలో అతను మానసికంగా దెబ్బ తిన్నాడని.. దీంతో పాటు ఆహార అలవాట్లు మారిపోయాయని.. ఫలితంగానే అతను ప్రాణాలు విడిచాడని అతను స్పష్టతనిచ్చాడు. ముకుల్ మరణం గురించి ఊహాగానాలు కట్టిపెట్టాలని అతను కోరాడు. "ముకుల్ చనిపోవడం గురించి రకరకాలుగా మాట్లాడుతున్నారు. అవేవీ నిజం కాదు. అతను ఫిట్‌గా లేడని అంటున్నారు. కానీ హాఫ్ మారథాన్‌లో పరుగెత్తే స్థాయి ఫిట్‌నెస్ అతడిది. తల్లిదండ్రుల మరణం తర్వాత అతణ్ని ఒంటరితనం వేధించింది. భార్య నుంచి విడిపోయాడు. అవి అతణ్ని కుంగదీశాయి. ముకుల్‌ను దగ్గరుండి పట్టించుకునేవారు కరువయ్యారు. ఎక్కువ సమయం ఒంటరిగా ఉండేదుకే ఇష్టపడేవాడు. తనకు సినిమా అవకాశాలు వచ్చినా అతను ఒప్పుకోలేదు. సరిగా తినేవాడు కాదు. ముకుల్ వారం రోజుల పాటు ఐసీయూలో ఉన్నాడు.

## క్రీడలతో శారీరక, మానసిక వికాసం

**– భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర – క్రీడాకారులకు అభినందన**





(మన గళం,కర్నూలు స్పోర్ట్స్) : క్రీడలతో శారీరక,మానసిక వికాసం సాధ్యపడుతుందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక ఔట్ డోర్ స్టేడియంలో యోగాంధ్ర రన్–2025 ని పురస్కరించుకుని అండర్–17 కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, అభినందించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ చిన్న నాటి నుంచి చదువుతో పాటు క్రీడలకు సైతం ప్రాధాన్యమివ్వాలన్నారు. చైనా లాంటి దేశాలు చిన్ననాటి నుంచే క్రీడలను ప్రోత్సహిస్తున్నాయని, అందువల్లే ఆ,యా దేశాలకు ఒలంపిక్స్ లో ఎక్కువ పతకాలు అంది వస్తున్నాయన్నారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు సైతం లభిస్తాయని, అందువల్ల క్రీడలకు ప్రాధాన్యమిస్తూ, తల్లి,దండ్రులు సైతం తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. కబడ్డీ కోచ్ చిన్న సుంకన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి, వారికి మరిన్ని మెళుకువలను నేర్పిస్తూ క్రీడా రంగానికి ఎనలేని సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కబడ్డీ కోచ్ లు, క్రీడాకారులు పాల్గొన్నారు.





## ఇంగ్లాండ్‌కు గంభీర్ పయనం



మన గళం తల్లికి అనారోగ్యంతో స్వదేశానికి వచ్చిన భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ గౌతం గంభీర్.. తిరిగి ఇంగ్లాండ్‌కు పయనం అయ్యాడు. తల్లి సీమ గంభీర్ గుండెపోటుకు గురవటంతో ఈ నెల 11న ఇంగ్లాండ్ పర్యటన నుంచి హుటాహుటిన గంభీర్ న్యూఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే. న్యూఢిల్లీలోని గంగారామ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గంభీర్ తల్లి ఆరోగ్యం ఇప్పుడు కుదుటపడింది. కష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలిచేందుకు స్వదేశం వచ్చిన గంభీర్.. జాతీయ జట్టు బాధ్యతల కోసం సోమవారమే లండన్‌కు తిరిగి పయనం అయ్యాడు!. భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు ఈ నెల 20న లీడ్స్‌లో ఆరంభం కానుంది. భారత్–ఏతో నాలుగు రోజుల టూర్ గేమ్ ముగించుకుని శుభ్‌మన్ గిల్ సేన ఇప్పటికే లీడ్స్‌కు చేరుకుంది. ఉదయం ఇంగ్లాండ్‌కు చేరుకోనున్న గంభీర్.. నేడు లీడ్స్‌లో జట్టుతో చేరనున్నాడు. గంభీర్ గైర్హాజరీలో సహాయక కోచ్‌లు రియాన్, సితాన్షు, మోర్కెల్‌లు జట్టు శిక్షణ బాధ్యతలను పర్యవేక్షించిన సంగతి తెలిసిందే.

## ఆ క్రికెటర్ నన్ను రిటైర్ అవ్వమన్నారు..



మన గళం అంతర్జాతీయ క్రికెట్‌లో జాతీయ జట్టులో స్థానం దక్కాలంటే ఎంతో అదృష్టం ఉండాలి. కొందరికి ఆ అదృష్టం తొందరగా వస్తే మరికొందరి విషయంలో మాత్రం చాలా ఆలస్యమవుతుంది. కొందరు క్రికెటర్లకు జట్టులో ఒకసారి చోటు దొరికినా.. మళ్లీ ఛాన్స్ కోసం ఎన్నో ఏళ్లు ఎదురుచూడాలి. అలాంటి పరిస్థితే భారత క్రికెటర్ కరుణ్ నాయర్‌కి ఎదురైంది. దాదాపు ఎనిమిది సంవత్సరాల తర్వాత కరుణ్ టీం ఇండియా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రెండు సంవత్సరాల క్రితం తనకు ఎదురైన ఓ ఘటనను అతను వెల్లడించారు. ఓ స్టార్ క్రికెటర్ తనను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్‌మెంట్ తీసుకోమని చెప్పారని.. ఆర్థికంగా భరోసా కోసం విదేశీ టి–20 లీగ్‌లు ఆడమని సూచించినట్లు కరుణ్ పేర్కొన్నాడు. ఆ క్రికెటర్ చెప్పినట్లు చేయడం సులభమే కానీ, తన లక్ష్యం తిరిగి జాతీయ జట్టులో ఆడటమే అని అన్నారు. ఇప్పుడు తన విషయంలో అదే జరిగిందని అన్నాడు. ప్రస్తుతం కరుణ్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇండియా–ఎ, ఇంగ్లండ్ లయన్స్ మధ్య జరిగిన అనధికారిక మ్యాచ్‌లో అతను డబుల్ సెంచరీ సాధించాడు. జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ కూడా అతనికి మద్దతుగా నిలుస్తున్నారు.

## వరల్డ్ కప్ తర్వాత వీడ్కోలు..



మన గళం న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవినె షాకింగ్ నిర్ణయం తీసుకుంది. నిరుడు మహిళల జట్టును పొట్టి వరల్డ్ కప్ విజేతగా నిలిపిన ఆమె.. వన్డేలకు అల్విదా చెప్పనుంది. వన్డే వరల్డ్ కప్ అనంతరం వన్డే ఫార్మాట్ నుంచి వైదొలగాలని ఆమె భావిస్తోందట. ఈ విషయాన్ని మంగళవారం ఈ విధ్వంసక ప్లేయర్ వెల్లడించింది. '50 ఓవర్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించేందుకు ఇదే సరైన సమయం అని భావిస్తున్నా' అని డెవినె తెలిపింది. న్యూజిలాండ్ క్రికెట్ కూడా ఈ వార్తను ధ్రువీకరించింది. ఇన్ని రోజులు దేశానికి ప్రాతినిధ్యం వహించాను. ఇక వన్డేల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. వన్డే వరల్డ్ కప్ తర్వాత రిటైర్మెంట్ పలకడం మంచిదని అనిపిస్తోంది. న్యూజిలాండ్ క్రికెట్ మద్దతు నాకు ఇన్నాళ్లు లభించడం అదృష్టంగా భావిస్తున్నా. వీడ్కోలుకు ముందు వైట్ ఫెర్న్స్‌కు నేను చేయగలిగినంత చేస్తాననే నమ్మకం నా సహచరులకు ఉంది. యువ క్రికెటర్లతో నిండిన ఈ జట్టు ప్రయాణం గొప్పగా సాగాలని కోరుకుంటున్నా. వచ్చే 6 నుంచి 9 నెలలు ఆటను ఆస్వాదించాలనుకుంటున్నా' అని డెవినె తెలిపింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మహిళల వన్డే వరల్డ్ కప్ సెప్టెంబర్ 30 న మొదలు కానుంది. అక్టోబర్ 1న ఇండోర్‌లో ఆస్ట్రేలియాతో కివీస్ తలపడనుంది.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310